https://siddipettimes.com

# సిద్దిపేట టైమ్స్

తెలుగు దినపత్రిక

సంపుటి - 02 | సంచిక -145 | తెలంగాణ | గురువారం | తేదీ: 16.10.2025 | ఎడిటర్ : మదూరి శ్రీరామ్ | పేజీలు 8 | వెల రూ.3

## గాయని రావు బాలసరస్వతీదేవి ఇక లేరు

కొంతకాలంగా ఆమె వృద్ధాప్య సంబంధిత సమస్యలతో సతమతం

తెలుగు ఇండస్ట్రీలో విషాదం..

2లో..



## ఈపీఎఫ్ఓ కొత్త నిబంధనలు




- సామాన్యుడు ఎలా బతకాలంటూ విపక్షాల ఆగ్రహం

న్యూఢిల్లీ : ఈపీఎఫ్ఓకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నిబంధనలపై ప్రతిపక్షాలు తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నాయి. ముందస్తు ఉపసంహరణలకు సంబంధించిన గడువును 2 నెలల నుంచి 12 నెలలకు పెంచడం, ఈపీఎఫ్ఓ మొత్తం ఉపసంహరణకు వేచి ఉండే కాలాన్ని కూడా 2 నెలల నుంచి 36 నెలలకు సవరించడం, ప్రావిడెంట్ ఫండ్ ఖాతాలో 25 శాతం కనీస నిల్వలు ఉండాలన్న నిబంధన తీసుకురావడంపై ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి. ఈ కొత్త నిబంధనలను తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి. ఈపీఎఫ్ఓ తీసుకువచ్చిన నిబంధనలు క్రూరమైనవని కాంగ్రెస్ సీనియర్ ఎంపీ మాణికం ఠాగూర్ అన్నారు. పెన్షనర్లు, ఉద్యోగం కోల్పోయిన వారికి తమ పొదుపు సొమ్ము అందకుండా చేస్తున్నారని విమర్శించారు. 2లో..

## సంచలన లొంగుబాటు



- మహారాష్ట్ర సీఎం సమక్షంలో మల్లోజుల సరెండర్

రాయ్‌పుర్ : మావోయిస్టుల సంచలనం సృష్టిస్తూ పెద్ద సంఖ్యలో ఆయుధాలను అప్పగించి జనజీవన స్రవంతిలో కలిసేందుకు ముందుకొచ్చారు. వారిలో మావోయిస్టు పార్టీకి దశాబ్దాలపాటు అత్యంత కీలక నాయకుడిగా వ్యవహరించిన మల్లోజుల వేణుగోపాల్‌రావు ఎలియాస్ భూపతి అలియాస్ సోను ఉన్నారు. గత రెండు మూడు రోజులుగా ఆయుధాలను త్యజించిన వారి వివరాలు బుధవారం అధికారికంగా వెల్లడయ్యాయి. బుధవారం గడ్చిరోలిలో జరిగిన కార్యక్రమంలో మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ సమక్షంలో మల్లోజులతో పాటు మరో 60 మంది, ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా, కాంకేర్, కొండగావ్ జిల్లాల్లో అధికారుల సమక్షంలో 78 మంది లొంగిపోయారు. 2లో..



## జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం..

- త్వరలో అక్రిడిటేషన్ పాలసీ విధివిధానాలు
- మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి
- సచివాలయంలో ఉన్నతాధికారులతో కీలక చర్చలు

సిద్దిపేట టైమ్స్, హైదరాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 15

జర్నలిస్టుల సంక్షేమం, గౌరవాన్ని కాపాడే దిశగా అక్రిడిటేషన్ పాలసీపై ప్రభుత్వం వేగంగా దృష్టి సారించిందని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. ఈ మేరకు ఈరోజు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో ఉన్నతాధికారులతో కలిసి అక్రిడిటేషన్ పాలసీ విధివిధానాలపై కీలక చర్చలు జరిపారు. 2లో..

## జూబ్లీహిల్స్ నుంచే గులాబీ జైత్రయాత్ర షురూ

### ఉప ఎన్నిక ఇదిజజ అభివృద్ధికి, అరాచకానికి మధ్య పోరు..

- ఆడబిడ్డ గెలుపు కోసం ఆడబిడ్డలు ఎదురుచూపు
- తెలంగాణభవన్‌లో మీడియాతో కేటీఆర్

సిద్దిపేట టైమ్స్, హైదరాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 15

'జూబ్లీహిల్స్‌లో జరుగుతున్న ఎన్నిక పార్టీల మధ్యలో జరుగుతున్న ఎన్నిక కాదు. ఈ ఉప ఎన్నిక ఇద్దరు వ్యక్తుల మధ్య ఎన్నిక కాదు. పదేండ్ల అభివృద్ధి పాలనకు, రెండేండ్ల అరాచక పాలనకు మధ్య జరుగుతున్న ఎన్నిక. పదేండ్ల పారదర్శక పాలనకు, రెండేండ్ల అవినీతి పాలనకు, పదేండ్ల రైతుబంధు పాలనకు, రెండేండ్ల రాబందు పాలనకు మధ్య జరుగుతున్న ఎన్నిక. జూబ్లీహిల్స్‌లో ఆడబిడ్డ గెలుపు కోసం రాష్ట్రంలోని కోటీ 67 లక్షల మంది ఆడబిడ్డలు ఎదురుచూస్తున్నారు' అని బీఆర్ఎస్ వర్కింగ్ కే తారకరామారావు పేర్కొన్నారు.జూబ్లీహిల్స్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థిగా మాగంటి సునీతా గోపీనాథ్ బుధవారం నామినేషన్ వేసేందుకు బయలుదేరేముందు బీఆర్ఎస్ పార్టీ కేంద్ర కార్యాలయం తెలంగాణభవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు 2లో..



## నామినేషన్ దాఖలు చేసిన మాగంటి సునీతాగోపీనాథ్




సిద్దిపేట టైమ్స్, హైదరాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 15

జూబ్లీహిల్స్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా మాగంటి సునీతాగోపీనాథ్ బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. జూబ్లీహిల్స్ పెద్దమ్మతల్లి ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

- వెంట బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- ముందుగా పెద్దమ్మతల్లి ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు 2లో..




## బాణాసంచా విక్రయాలకు అనుమతి తప్పనిసరి..

- దీపావళికి భద్రతా ప్రమాణాలు పాటించాలి..
- పోలీస్ కమిషనర్

పోలీస్ కమిషనర్ ఎస్. యం. విజయ్ కుమార్

సిద్దిపేట టైమ్స్, సిద్దిపేట, అక్టోబర్ 15

ప్రజల భద్రత దృష్టిలో ఉంచుకొని రాబోయే దీపావళిని ప్రజలందరూ సంతోషంగా జరుపుకోవాలని, అనుమతులు లేకుండా బాణాసంచా దుకాణాలను ఏర్పాటు చేస్తే ప్రేలుడు పదార్థాల చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పోలీస్ కమిషనర్ పోలీస్ కమిషనర్ ఎస్. యం. విజయ్ కుమార్ అన్నారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడవద్దు అని సూచించారు. 2లో..

## బీసీ కార్డు ప్లే చేసి బీజేపీ మోసం

- 'ఇదేమి రాజ్యం.. కిషన్ రెడ్డి రాజ్యం'
- తెలంగాణలో ఎన్నికలొచ్చినప్పడే బీసీలు గుర్తుకొస్తారా
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిపై రాజాసింగ్ సంచలన ఆరోపణలు

2లో..




## ఆడబిడ్డను అవమానించేలా మాట్లాడటం దుర్మార్గం

- పేదవారి ఇళ్లను కూలగొడుతున్న రేవంత్ రెడ్డిని రాహుల్ గాంధీ ప్రశ్నించాలని
- హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో బీజేపీ నుంచి బీఆర్ఎస్‌లోకి భారీగా చేరికలు
- జూబ్లీహిల్స్‌లో రేవంత్ రెడ్డి దొంగ ఓట్లు చేర్చుతున్నారు
- మాజీ మంత్రి హరీశ్‌రావు

\- బీఆర్ఎస్‌లోకి భారీగా చేరికలు

2లో..



## కేసీఆర్ ఫొటోను ఉపయోగించం

- నాపై కుట్ర చేసి బీఆర్ఎస్ నుంచి బయటకు గెంటేశారు..
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత
- 'జాగృతి జనం బాట' యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరణ
- పోస్టర్‌పై తెలంగాణ తల్లి, జయశంకర్ ఫొటోలు

2లో..

## జూబ్లీహిల్స్ బీజేపీ అభ్యర్థి లంకల దీపక్ రెడ్డి

- ఉత్తర్వులు జారీ చేసిన ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి అరుణ్‌సింగ్

సిద్దిపేట టైమ్స్, హైదరాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 15

జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికకు బీజేపీ తన అభ్యర్థిని ప్రకటించింది. పార్టీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్ రెడ్డి(49)ని తమ అభ్యర్థిగా బీజేపీ నాయకత్వం ఖరారు చేసింది. 2లో..



## 2030 కామన్వెల్త్ క్రీడలకు అహ్మదాబాద్ ఆతిథ్యం

- శతాబ్ది ఉత్సవాల వేళ భారత్‌లో జరగనున్న ప్రతిష్ఠాత్మక గేమ్స్

న్యూఢిల్లీ : భారత క్రీడారంగంలో ఒక చరిత్రాత్మక ఘట్టానికి తెరలేవనుంది. ప్రతిష్ఠాత్మక కామన్వెల్త్ క్రీడల శతాబ్ది ఉత్సవాలకు భారత్ వేదిక కాబోతోంది. 2030లో జరగనున్న 24వ కామన్వెల్త్ గేమ్స్‌కు గుజరాత్‌లోని అహ్మదాబాద్ నగరాన్ని ఆతిథ్య నగరంగా సిఫార్సు చేస్తూ కామన్వెల్త్ స్పోర్ట్ ఎగ్జిక్యూటివ్ బోర్డ్ కీలక ప్రకటన చేసింది. కామన్వెల్త్ క్రీడా ఉద్యమం ప్రారంభమై వందేళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఈ క్రీడలు జరగనుండటం విశేషం. భారత ప్రభుత్వం, గుజరాత్ ప్రభుత్వం, కామన్వెల్త్ గేమ్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సంయుక్తంగా సమర్పించిన ప్రతిపాదనను పరిశీలించిన అనంతరం ఈ సిఫార్సు చేశారు. దీనిపై తుది నిర్ణయాన్ని 2025 నవంబర్‌లో జరిగే కామన్వెల్త్ స్పోర్ట్ జనరల్ అసెంబ్లీ సమావేశంలో తీసుకోనున్నారు. 2లో..

# సంచలన లొంగుబాటు

**- మహారాష్ట్ర సీఎం సమక్షంలో మల్లోజుల సరెండర్**

**రాయ్‌పుర్ :** మావోయిస్టుల సంచలనం సృష్టిస్తూ పెద్ద సంఖ్యలో ఆయుధాలను అప్పగించి జనజీవన స్రవంతిలో కలిసేందుకు ముందుకొచ్చారు. వారిలో మావోయిస్టు పార్టీకి దశాబ్దాలపాటు అత్యంత కీలక నాయకుడిగా వ్యవహరించిన మల్లోజుల వేణుగోపాల్‌రావు ఎలియాస్ భూపతి అలియాస్ సోను ఉన్నారు. గత రెండు మూడు రోజులుగా ఆయుధాలను త్యజించిన వారి వివరాలు బుధవారం అధికారికంగా వెల్లడయ్యాయి. బుధవారం గడ్చిరోలిలో జరిగిన కార్యక్రమంలో మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ సమక్షంలో మల్లోజులతో పాటు మరో 60 మంది, ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా, కాంకేర్, కొండగావ్ జిల్లాల్లో అధికారుల సమక్షంలో 78 మంది లొంగిపోయారు. మల్లోజుల వేణుగోపాల్ తలపై రూ.6 కోట్ల రివార్డుంది. ఆయనతో కలిసి 60 మంది మావోయిస్టులు ఆయుధాలను వదిలేశారు. వారంతా 54 ఆయుధాలను పోలీసులకు అప్పగించారు. అందులో ఏకే47లు, ఇన్సాస్ రైఫిళ్లు ఉన్నాయి. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ ప్లాటూన్ ఆపరేషన్లను నిర్వహించడంతోపాటు మావోయిస్టుల వ్యూహకర్తగా మల్లోజుల వ్యవహరించారు. రెండ్రోజుల కిందే వీరంతా పోలీసుల వద్దకు వచ్చి లొంగిపోయారు.ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా, కాంకేర్, కొండగావ్ జిల్లాల్లో 78 మంది మావోయిస్టులు లొంగిపోయారు. ఇందులో ఇద్దరు దండకారణ్య జోనల్ కమిటీ సభ్యులున్నారు. మావోయిస్టు పార్టీలో అత్యంత శక్తిమంతమైన పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ (పీజీఎల్‌ఏ) బెటాలియన్ 1 సభ్యుడైన 53 ఏళ్ల ఓయం లఖ్ము లొంగిపోయిన వారిలో ఉన్నాడు. లొంగిపోయిన వారందరికీ రూ.50,000 చొప్పున అందించారు. దండకారణ్య జోనల్ కమిటీ సభ్యులు రాజ్‌మన్ మాండవీ, రాజు సలాం ఆధ్వర్యంలో ఒక్క కాంకేర్ జిల్లాలో 32 మంది మహిళలతో సహా 50 మంది లొంగిపోయారు. 2023 నుంచి ఇప్పటిదాకా ఛత్తీస్‌గఢ్‌లో 2,000 మంది దాకా నక్సల్స్ లొంగిపోయారని అధికారులు తెలిపారు. భ్రమాగఢ్ అటవీ ప్రాంతంలో నమ్మకమైన మధ్యవర్తుల ద్వారా పోలీసులు చర్చలు కొనసాగించారు. చివరకు 10 రోజుల కిందట.. లొంగిపోతానన్న తన మాటకు మల్లోజుల కట్టుబడి ఉంటారని ఫోడేవాడ గ్రామస్థులతో ఆయన జరిపిన సంభాషణలతో తేలిపోయిందని పోలీసులు గుర్తించారు. ఈ నెల 13వ తేదీ ఉదయానికల్లా ప్రభుత్వంతో చర్చలు పూర్తయ్యాయి. అదే రోజు సాయంత్రం భ్రమాగఢ్ తాలూకాలోని హోదరి గ్రామంలో సహచరులతో కలిసి లొంగిపోయేందుకు వస్తున్నారని సందేశం వచ్చింది. మల్లోజుల 13వ తేదీ రాత్రి మరో 60 మందితో కలిసి వచ్చారు. వారిని అదుపులోకి తీసుకున్న పోలీసులు.. కట్టుదిట్టమైన భద్రత మధ్య గడ్చిరోలికి తీసుకెళ్లారు.

## నామినేషన్ దాఖలు చేసిన మాగంటి సునీతాగోపీనాథ్

**సిద్దిపేట టైమ్స్, హైదరాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 15**

జూబ్లీహిల్స్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా మాగంటి సునీతాగోపీనాథ్ బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. 2014 నుంచి ప్రతి ఎన్నికల సందర్భంలోనూ దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ నామినేషన్ వేయడానికి ఇంటినుంచి బయలుదేరే సమయంలో పెద్ద కుమార్తె అక్షర ఎదురు రావడం, అక్కడినుంచి జూబ్లీహిల్స్ పెద్దమ్మతల్లి ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నది. మాగంటి సునీత తన భర్త మాగంటి గోపీనాథ్ చిత్రపటానికి నివాళులు అర్పించిన తర్వాత పెద్ద కుమార్తె అక్షర ఎదురురాగా పెద్దమ్మగుడికి బయలుదేరారు. అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డి స్వయంగా కారు నడుపుతూ వారిని తెలంగాణభవన్‌కు తోడ్కొని వచ్చారు. తెలంగాణభవన్ నుంచి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తోపాటు ముఖ్య నాయకులతో కలిసి జూబ్లీహిల్స్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి చేరుకున్నారు. ఆమె రెండు సెట్ల నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు.

# జూబ్లీహిల్స్ నుంచే గులాబీ జైత్రయాత్ర షురూ

**- ఉప ఎన్నిక ఇదిజజ అభివృద్ధికి, అరాచకానికి మధ్య పోరు..**
**- ఆడబిడ్డ గెలుపు కోసం ఆడబిడ్డలు ఎదురుచూపు**
**- తెలంగాణభవన్‌లో మీడియాతో కేటీఆర్**

**సిద్దిపేట టైమ్స్, హైదరాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 15**



'జూబ్లీహిల్స్‌లో జరుగుతున్న ఎన్నిక పార్టీల మధ్యలో జరుగుతున్న ఎన్నిక కాదు. ఈ ఉప ఎన్నిక ఇద్దరు వ్యక్తుల మధ్య ఎన్నిక కాదు. పదేండ్ల అభివృద్ధి పాలనకు, రెండేండ్ల అరాచక పాలనకు మధ్య జరుగుతున్న ఎన్నిక. పదేండ్ల పారదర్శక పాలనకు, రెండేండ్ల అవినీతి పాలనకు, పదేండ్ల రైతుబంధు పాలనకు, రెండేండ్ల రాబందు పాలనకు మధ్య జరుగుతున్న ఎన్నిక. జూబ్లీహిల్స్‌లో ఆడబిడ్డ గెలుపు కోసం రాష్ట్రంలోని కోటీ 67 లక్షల మంది ఆడబిడ్డలు ఎదురుచూస్తున్నారు' అని బీఆర్ఎస్ వర్కింగ్ కే తారకరామారావు పేర్కొన్నారు.జూబ్లీహిల్స్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థిగా మాగంటి సునీతా గోపీనాథ్ బుధవారం నామినేషన్ వేసేందుకు బయలుదేరేముందు బీఆర్ఎస్ పార్టీ కేంద్ర కార్యాలయం తెలంగాణభవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించాలని కేటీఆర్ విజ్ఞప్తిచేశారు. ఆమెను గెలిపిస్తేనే కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలు అమలవుతాయని, ప్రజలకు, రైతులకు, అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని చెప్పారు. రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి, తర్వాత మోసపోయిన యువతీయువకులు కూడా సునీతాగోపీనాథ్ విజయం కోసం చూస్తున్నారని తెలిపారు. హైడ్రా పేరుతో తమ ఇండ్లు కూలగొట్టిన అరాచకాలను చూసిన తర్వాత, ఈ ఎన్నికకల్లో బీఆర్ఎస్ అభ్యర్థి గెలవాలని, కాంగ్రెస్ సర్కారు అరాచకాలు ఆగాలని నగర పేదలు చూస్తున్నారని పేర్కొన్నారు.తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పాలన మరోసారి రావడానికి జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక పునాది కాబోతున్నదని కేటీఆర్ పేర్కొన్నారు. రాష్ట్రంలో మరోసారి గులాబీ పార్టీ జైత్రయాత్ర జూబ్లీహిల్స్ నుంచే ప్రారంభం కాబోతున్నదని తెలిపారు. అన్ని వర్గాల మద్దతుతో, అండతో తమ పార్టీ అభ్యర్థి సునీతాగోపీనాథ్ ఘన విజయం సాధించబోతున్నారని ధీమా వ్యక్తంచేశారు. రెండేండ్ల ఈ విఫల కాంగ్రెస్ ప్రభుత్వానికి, ఆ పార్టీకి బుద్ధి చెప్పడానికి ప్రతి ఒకరూ తమ పార్టీ అభ్యర్థికి మద్దతు ఇవ్వాలని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ జూబ్లీహిల్స్‌లో ప్రతి ఒకరికి, నియోజకవర్గానికి విశేషమైన సేవలు అందించిన నాయకుడని గుర్తుచేశారు. 'హైదరాబాద్ నగరంలో అన్ని నియోజకవర్గాల్లో మా పార్టీ గెలుపొందిందంటే, అప్పటి జిల్లా అధ్యక్షుడిగా పనిచేసిన గోపీనాథ్ కృషి కూడా ఉన్నది. గోపీనాథ్ అకాల మరణంతో బాధపడుతున్న కుటుంబాన్ని అందరూ ఆదుకోవాలని మా పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ నిర్ణయించి, ఆయన సతీమణి సునీతాగోపీనాథ్‌కి టికెట్ కేటాయించారు. బీఆర్ఎస్ కుటుంబంలో ఒకరైన సునీత విజయం కోసం పార్టీ కీలక నాయకులంతా పనిచేయాలని కేసీఆర్ ఆదేశించారు. అందరి ఆశీర్వాదాలతో సునీత ఎన్నికల్లో గెలవబోతున్నారు' అని కేటీఆర్ ధీమా వ్యక్తంచేశారు. కార్యక్రమంలో ఎంపీ రవిచంద్ర, మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్‌యాదవ్, పద్మారావుగౌడ్, గంగుల కమలాకర్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌గౌడ్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, మాజీ ఎమ్మెల్యేలు తాటికొండ రాజయ్య, విష్ణువర్ధన్‌రెడ్డి, నాయకులు, రావుల శ్రీధర్‌రెడ్డి, సోహైల్, బీఆర్ఎస్ పార్టీ జూబ్లీహిల్స్ అభ్యర్థి మాగంటి సునీతాగోపీనాథ్, ఆమె కుటుంబసభ్యులు తదితరులు పాల్గొన్నారు.జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను రాష్ట్ర ప్రభుత్వానికి, కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం చెప్పడానికి అవకాశంగా ప్రజలు భావిస్తున్నారని కేటీఆర్ చెప్పారు. 'మూతపడుతున్న బస్తీ దావాఖానలు, ఆగుతున్న తాగునీటి సరఫరా విషయాన్ని ప్రజలందరూ చూస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ ఒక్క ఇల్లు కూడా హైదరాబాదులో కట్టలేదు. కేసీఆర్ కట్టించిన లక్ష ఇండ్లు, ఇచ్చిన ఇండ్ల పట్టాలు, చేసిన ఇతర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అన్నీ కూడా హైదరాబాద్ నగర ప్రజలకు గుర్తున్నాయి. కాంగ్రెస్ చేతిలో మోసపోయిన మైనార్టీలు ఈ ఎన్నికను ఒక అవకాశంగా భావిస్తున్నారు.ప్రభుత్వంలో ఒక మైనార్టీకి కూడా అవకాశం ఇవ్వకుండా దారుణంగా అవమానపరిచిన రాష్ట్ర ప్రభుత్వానికి, కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం చెప్పడానికి మైనార్టీలు జూబ్లీహిల్స్ ఉపఎన్నికను ఒక అవకాశంగా భావిస్తున్నారు. తమకు ఇచ్చిన బీసీ డిక్లరేషన్, రిజర్వేషన్లు అన్నీ మోసమని, ఈ అంశంలో గుణపాఠం చెప్పడానికి రాష్ట్రవ్యాప్తంగా బీసీలు సిద్ధంగా ఉన్నారు. దళితబంధు, అభయహస్తం అని చెప్పి మోసం చేసిన దళితులు కూడా ఆగ్రహంతో ఉన్నారు. ఈ క్రమంలో మా అభ్యర్థి మాగంటి సునీతాగోపీనాథ్‌కు అన్ని వర్గాల నుంచి మద్దతు వెల్లువెత్తుతున్నది' అని కేటీఆర్ చెప్పారు.



## బీసీ కార్డు ప్లే చేసి బీజేపీ మోసం

**- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిపై రాజాసింగ్ సంచలన ఆరోపణలు**

**సిద్దిపేట టైమ్స్, హైదరాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 15**

కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిపై బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. 'ఇదేమి రాజ్యం.. ఇదేమి రాజ్యం.. కిషన్ రెడ్డి రాజ్యం.. కిషన్ రెడ్డి రాజ్యం' అంటూ ఎద్దేవా చేశారు. తెలంగాణలో ఎన్నికలు జరిగినప్పుడల్లా లేదా ప్రముఖ నాయకుడు వచ్చినప్పుడల్లా, భవిష్యత్తులో ఒక బీసీ తెలంగాణకు ముఖ్యమంత్రి అవుతారని అందరూ అంటారని, అయితే తెలంగాణలో చిన్న ఎన్నికలైనా గాని పెద్ద ఎన్నికలైనా గాని వస్తే బీసీలనే మర్చిపోతారని రాజాసింగ్ ఆరోపించారు. 'బీసీలు మన తెలంగాణ భారతీయ జనతా పార్టీ లోపట ఎక్కడున్నారో కొద్ది చెప్తారా కిషన్ రెడ్డి. నేను ఇంతకు ముందు ఎప్పుడూ ఎస్సీలు, బీసీలు, ఎస్టీలు లేదా ఓబీసీల గురించి మాట్లాడలేదు. నేను హిందూత్వం గురించి మాత్రమే మాట్లాడుతాను. కానీ నేను ఈరోజు దాని గురించి మాట్లాడటానికి కారణం మీరు ప్రతి ఎన్నికల్లో బీసీ కార్డును ప్లే చేసి, బీసీ సమాజానికి మీరు మోసం చేస్తారు. అందుకే నేను ఈరోజు చెప్పాల్సి వచ్చింది' అని కేంద్రమంత్రి కిషన్ రెడ్డిపై రాజాసింగ్ మరోసారి తన మాటల తూటాలను వదిలారు. తాజాగా నిన్న(మంగళవారం) కూడా కేంద్రమంత్రి కిషన్ రెడ్డిపై ఎమ్మెల్యే రాజాసింగ్ ఆరోపణలు చేశారు.

# ఈపీఎఫ్ఓ కొత్త నిబంధనలు

**- సామాన్యుడు ఎలా బతకాలంటూ విపక్షాల ఆగ్రహం**

**న్యూఢిల్లీ :** ఈపీఎఫ్ఓకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నిబంధనలపై ప్రతిపక్షాలు తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నాయి. ముందస్తు ఉపసంహరణలకు సంబంధించిన గడువును 2 నెలల నుంచి 12 నెలలకు పెంచడం, ఈపీఎఫ్ఓ మొత్తం ఉపసంహరణకు వేచి ఉండే కాలాన్ని కూడా 2 నెలల నుంచి 36 నెలలకు సవరించడం, ప్రావిడెంట్ ఫండ్ ఖాతాలో 25 శాతం కనీస నిల్వలు ఉండాలన్న నిబంధన తీసుకురావడంపై ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి. ఈ కొత్త నిబంధనలను తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి. ఈపీఎఫ్ఓ తీసుకువచ్చిన నిబంధనలు క్రూరమైనవని కాంగ్రెస్ సీనియర్ ఎంపీ మాణికం ఠాగూర్ అన్నారు. పెన్షనర్లు, ఉద్యోగం కోల్పోయిన వారికి తమ పొదుపు సొమ్ము అందకుండా చేస్తున్నారని విమర్శించారు. ఉద్యోగం కోల్పోయిన వారు పీఎఫ్ నిధి కోసం ఇప్పుడు ఏడాది పాటు వేచి చూడాల్సిన పరిస్థితి ఉంటుందని అన్నారు. ఇది సంస్కరణ కాదని, దోపిడీ అని ఆయన తీవ్రంగా విమర్శించారు. ప్రధాని మోదీ వెంటనే జోక్యం చేసుకుని సామాన్యుల జీవితాలతో ఆడుకుంటున్న మన్‌సుఖ్ మాండవీయను కట్టడి చేయాలని సూచించారు. ఒక ఉద్యోగి ఏదైనా కారణంతో ఉద్యోగం కోల్పోతే అతను బిల్లులు, ఈఎంఐలు ఎలా చెల్లిస్తారని తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ సాకేత్ గోఖలే ప్రశ్నించారు. ఏడాది తర్వాత నిధిని తీసుకున్న 75 శాతం మాత్రమే ఉపసంహరించుకోగలడని, మిగిలిన 25 శాతం కోసం పదవీ విరమణ వరకు వేచి చూడాలని వ్యాఖ్యానించారు. తమ నిధులను తీసుకోకుండా చేస్తే మధ్య తరగతి వ్యక్తి మనుగడ ఎలా సాగిస్తారని ఆయన నిలదీశారు. నిబంధనలు సరళీకరణ పేరుతో కష్టపడి సంపాదించిన సొమ్మును దోచుకుంటున్నారని కాంగ్రెస్ అధికార ప్రతినిధి షమా మహ్మద్ విమర్శించారు. 25 శాతం కనీస నిల్వల నిబంధన పేరుతో పదవీ విరమణ వరకు ఉపసంహరించుకునే అవకాశం కల్పించకపోవడం సరికాదని ఆమె అన్నారు.

# ఆడబిడ్డను అవమానించేలా మాట్లాడటం దుర్మార్గం

**-మాజీ మంత్రి హరీశ్‌రావు**
**- బీఆర్ఎస్‌లోకి భారీగా చేరికలు**

**సిద్దిపేట టైమ్స్, హైదరాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 15**



భర్తను కోల్పోయిన భార్య, తండ్రిని కోల్పోయిన పిల్లలు ఎంతో దుఃఖంలో ఉన్నారని పేర్కొన్నారు. భర్తను కోల్పోయి రెండు నెలలు కాలేదు.. భర్తను తలచుకుని బాధలో మాగంటి సునీత కన్నీళ్లు పెట్టుకుంటే ఆ దుఃఖాన్ని కూడా కాంగ్రెస్ నాయకులు రాజకీయం చేస్తున్నారని మాజీ మంత్రి హరీశ్ రావు మండిపడ్డారు. భర్తను కోల్పోయి దుఃఖంలో ఉన్న ఆడబిడ్డను అవమానించే విధంగా మాట్లాడటం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో బీజేపీ నుంచి బీఆర్ఎస్‌లోకి భారీగా చేరికలు జరిగాయి. బీజేపీ సీనియర్ మహిళా నాయకులు కళావతి, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యురాలు లక్ష్మీ, మహిళా మోర్చా నాయకులు శైలజ, ఆర్కే లక్ష్మీ, అనురాధ, మంజుల, సత్యవతితో పాటు 200 మంది బీఆర్ఎస్‌లో చేరారు. మాజీ మంత్రి హరీశ్‌రావు గులాబీ కండువాలు కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. మాగంటి సునీత దుఃఖాన్ని అవమానించేవిధంగా కాంగ్రెస్ మంత్రులు నానా మాటలు మాట్లాడుతున్నారని హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. విజ్ఞత మరచి విచక్షణ లేకుండా చిల్లర రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు.ప్రజలు విజ్ఞులు.. ప్రజలు మంచి, చెడు ఆలోచిస్తారని హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. మాగంటి గోపీనాథ్ ఎన్నికల్లో గెలవాలని.. బీజేపీకి రాజీనామా చేసి బీఆర్ఎస్‌లో చేరిన మీ అందరికీ పేరుపేరున ధన్యవాదాలు అని పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ ప్రజల ఆశీర్వాదంతో మాగంటి గోపీనాథ్ ఐదేండ్ల కోసం బీఆర్ఎస్ నుంచి గెలిచారని హరీశ్‌రావు అన్నారు. కానీ దురదృష్టవశాత్తు చనిపోయారు.. ఆ కుటుంబాన్ని నిలబెట్టాలి.. అని అన్నారు. అందుకే జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచి మాగంటి గోపీనాథ్ సతీమణి సునీతకు టికెట్ ఇచ్చామని తెలిపారు. బిహార్‌లో ఓట్ చోరీ అని రాహుల్ గాంధీ అంటున్నాడని.. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో రేవంత్ రెడ్డి ఓటు చోరీ చేస్తుంటే ఎందుకు మాట్లాడవని రాహుల్ గాంధీని నిలదీశారు. రేవంత్ రెడ్డిని ఓటు చోరీ చేయకుండా నిజాయితీగా ఉండాలని చెప్పాల్సిన బాధ్యత రాహుల్ గాంధీకి లేదా అని ప్రశ్నించారు. జూబ్లీహిల్స్ లో భర్తను కోల్పోయిన సునీతను ఒడగొట్టాలని 20 వేల దొంగ ఓట్లను కూడగట్టుకున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ఏం చేసింది, బీజేపీ ఏం చేసింది అనేది ఒకసారి ఆలోచించాలని ప్రజలకు సూచించారు. తెలంగాణ విషయంలో కాంగ్రెస్, బీజేపీలు ద్రోహం చేశాయని అన్నారు. కాంగ్రెస్, బీజేపీలు చెప్పేదొకటి చేసేదొకటి అని అవిమర్శించారు. రాహుల్ గాంధీ మొహబ్బత్ కి దుకాణ్ అని అంటారు. మోదీ సబ్ కా సాత్ సబ్‌కా వికాస్ అంటారని గుర్తుచేశారు. కానీ జరుగుతున్నది ఏమిటి? హైడ్రా పేరిట పేదవారి ఇల్లు కూలగొట్టడం మొహబ్బత్ దుకాణ్ ఆ అని ప్రశ్నించారు. పెద్దపెద్ద ఇల్లులు కూల కొట్టడం లేదని అన్నారు. కాంగ్రెస్ నాయకులు పట్నం మహేందర్ రెడ్డి ఇల్లు నీళ్లల్లనే ఉంటది.. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఇల్లు హైడ్రాలనే ఉంటది. ఎమ్మెల్యే గాంధీ గవర్నమెంట్ ల్యాండ్ కబ్జా పెట్టుకుని ఉంటాడని అన్నారు. పండుగ పూట ఆదివారం నాడు రాత్రి వచ్చి గరీబోళ్ల ఇల్లు కూలగొట్టి వేల కుటుంబాలను రోడ్డుమీదికి తెచ్చిండు రేవంత్ రెడ్డి అని మండిపడ్డారు. దీనిపై సీఎం రేవంత్ రెడ్డిని రాహుల్ గాంధీ ఎందుకు ప్రశ్నించడం లేదని నిలదీశారు. పెద్దోళ్ల ఇల్లులు కూలగొట్టట్లేదు.. పేదోళ్ల ఇల్లులు ఎందుకు కూలగొడుతున్నావ్ రేవంత్ రెడ్డి అని రాహుల్ గాంధీ ఎందుకు అడగడం లేదని ప్రశ్నించారు.

## జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం..

**- త్వరలో అక్రిడిటేషన్ పాలసీ విధివిధానాలు**
**- మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి**
**- సచివాలయంలో ఉన్నతాధికారులతో కీలక చర్చలు**

**సిద్దిపేట టైమ్స్, హైదరాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 15**



జర్నలిస్టుల సంక్షేమం, గౌరవాన్ని కాపాడే దిశగా అక్రిడిటేషన్ పాలసీపై ప్రభుత్వం వేగంగా దృష్టి సారించిందని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. ఈ మేరకు ఈరోజు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో ఉన్నతాధికారులతో కలిసి అక్రిడిటేషన్ పాలసీ విధివిధానాలపై కీలక చర్చలు జరిపారు. ఈ సమీక్షా సమావేశంలో మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస రెడ్డి, సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ సిహెచ్. ప్రియాంక, సీఎం సిపిఆర్‌వో మల్సూర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమం కోసం ఎంతగానో కృషి చేస్తుందన్నారు. అర్హులైన జర్నలిస్టులకు ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ కార్యక్రమాలు సక్రమంగా అందేలా విధి విధానాలను రూపొందిస్తున్నాం అని తెలిపారు. జర్నలిస్టుల గౌరవాన్ని కాపాడే విధంగా అక్రిడిటేషన్ పాలసీ ఉండాలని అధికారులకు మంత్రి స్పష్టం చేశారు. వీలైనంత త్వరగా జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులను జారీ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని మంత్రి తెలిపారు. అందుకోసం ఈ నెల చివరి నాటికి అక్రిడిటేషన్ పాలసీకి సంబంధించిన విధివిధానాలను ఖరారు చేయాలని అధికారులను ఆదేశించారు. మంత్రి ఆదేశాల మేరకు అధికారులు ఈ ప్రక్రియను వేగవంతం చేయనున్నారు.

# 2030 కామన్వెల్త్ క్రీడలకు అహ్మదాబాద్ ఆతిథ్యం

**- శతాబ్ది ఉత్సవాల వేళ భారత్‌లో జరగనున్న ప్రతిష్ఠాత్మక గేమ్స్**

**న్యూఢిల్లీ :** భారత క్రీడారంగంలో ఒక చరిత్రాత్మక ఘట్టానికి తెరలేవనుంది. ప్రతిష్ఠాత్మక కామన్వెల్త్ క్రీడల శతాబ్ది ఉత్సవాలకు భారత్ వేదిక కాబోతోంది. 2030లో జరగనున్న 24వ కామన్వెల్త్ గేమ్స్‌కు గుజరాత్‌లోని అహ్మదాబాద్ నగరాన్ని ఆతిథ్య నగరంగా సిఫార్సు చేస్తూ కామన్వెల్త్ స్పోర్ట్ ఎగ్జిక్యూటివ్ బోర్డ్ కీలక ప్రకటన చేసింది. కామన్వెల్త్ క్రీడా ఉద్యమం ప్రారంభమై వందేళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఈ క్రీడలు జరగనుండటం విశేషం. భారత ప్రభుత్వం, గుజరాత్ ప్రభుత్వం, కామన్వెల్త్ గేమ్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సంయుక్తంగా సమర్పించిన ప్రతిపాదనను పరిశీలించిన అనంతరం ఈ సిఫార్సు చేశారు. దీనిపై తుది నిర్ణయాన్ని 2025 నవంబర్‌లో జరిగే కామన్వెల్త్ స్పోర్ట్ జనరల్ అసెంబ్లీ సమావేశంలో తీసుకోనున్నారు. దేశంలో క్రీడా సంస్కృతిని ప్రోత్సహించేందుకు ప్రధాని నరేంద్ర మోదీ 'ఖేలో ఇండియా' వంటి కార్యక్రమాల ద్వారా చేస్తున్న కృషికి ఈ సిఫార్సు అద్దం పడుతోంది. ఈ పరిణామంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా హర్షం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ దార్శనిక నాయకత్వం వల్లే ఈ గౌరవం దక్కిందని ఆయన అన్నారు. "ప్రపంచ స్థాయి క్రీడా మౌలిక సదుపాయాలను సృష్టించడం ద్వారా, ప్రపంచ వేదికపై పోటీపడగల క్రీడాకారులను తీర్చిదిద్దడం ద్వారా భారత్ ఈ ఘనతను సాధించింది" అని ఆయన పేర్కొన్నారు. గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ మాట్లాడుతూ, "ఇది గుజరాత్‌కు, భారతదేశానికి నిజంగా గర్వకారణమైన క్షణం" అని అన్నారు. భారత కామన్వెల్త్ గేమ్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు పీటీ ఉష స్పందిస్తూ... "అహ్మదాబాద్‌లో జరిగే శతాబ్ది కామన్వెల్త్ గేమ్స్ భవిష్యత్ తరాల కోసం జరగనున్నాయి. సుస్థిరత, సమ్మిళితత్వం, ఆవిష్కరణల పునాదులపై ఈ క్రీడలను నిర్మిస్తాం" అని వివరించారు. ఈ క్రీడల నిర్వహణ ద్వారా పట్టణ పునరుద్ధరణ, యువత భాగస్వామ్యం, అంతర్జాతీయ సహకారం వంటివి మెరుగవుతాయని, ప్రపంచ క్రీడా కేంద్రంగా ఎదగాలన్న భారత్ ఆశయానికి ఇది మరింత బలాన్నిస్తుందని నిపుణులు భావిస్తున్నారు.

## బాణాసంచా విక్రయాలకు అనుమతి తప్పనిసరి..

**- దీపావళికి భద్రతా ప్రమాణాలు పాటించాలి..**
**- పోలీస్ కమిషనర్ పోలీస్ కమిషనర్ ఎస్. యం. విజయ్ కుమార్**

**సిద్దిపేట టైమ్స్, సిద్దిపేట, అక్టోబర్ 15**




ప్రజల భద్రత దృష్టిలో ఉంచుకొని రాబోయే దీపావళిని ప్రజలందరూ సంతోషంగా జరుపుకోవాలని, అనుమతులు లేకుండా బాణాసంచా దుకాణాలను ఏర్పాటు చేస్తే ప్రేలుడు పదార్థాల చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పోలీస్ కమిషనర్ పోలీస్ కమిషనర్ ఎస్. యం. విజయ్ కుమార్ అన్నారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడవద్దు అని సూచించారు. పోలీస్ కమిషనర్ పోలీస్ కమిషనర్ ఎస్. యం. విజయ్ కుమార్, ఐపిఎస్ ఈ సందర్భంగా మాట్లాడుతూ కమిషనరేట్ పరిధిలో పట్టణాలలో, మండల కేంద్రాలలో, ఆయా గ్రామాలలో తాత్కాలికంగా షాపులు ఏర్పాటు చేసుకునే షాపుల యజమానులు సంబంధిత ఏసీపీల పర్మిషన్ తప్పకుండా తీసుకోవాలని సూచించారు. తాత్కాలికంగా ఏర్పాటు చేసే బాణాసంచా షాపుల వద్ద ఎలాంటి ప్రమాదం జ ర గ కుం డా అన్ని రకాల సేఫ్టీ మెజర్స్ తీసుకోవాలని. సూచించారు. ఎలాంటి అనుమతులు లేకుండా బాణాసంచా దుకాణాలను ఏర్పాటు చేసిన, సరైన భద్రతా ప్రమాణాలు పాటించకుండా దుకాణాలు ఏర్పాటు చేసిన, విక్రయాలు జరిపిన, వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. దీపావళి పండుగ పురస్కరించుకుని బాణాసంచా విక్రయదారులపై ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. బాణాసంచా దుకాణాలతో ప్రజలకు ఏదైనా ఇబ్బందికరంగా ఉంటే వెంటనే డయల్ 100 లేదా సిద్దిపేట పోలీస్ కంట్రోల్ రూమ్ నెంబర్ 8712667100 కు కాల్ చేసి వివరాలు తెలపాలని సూచించారు.

# కేసీఆర్ ఫొటోను ఉపయోగించం

**- నాపై కుట్ర చేసి బీఆర్ఎస్ నుంచి బయటకు గెంటేశారు..**
**- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత**
**- 'జాగృతి జనం బాట' యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరణ**
**- పోస్టర్‌పై తెలంగాణ తల్లి, ప్రొఫెసర్ జయశంకర్ ఫొటోలు**

**సిద్దిపేట టైమ్స్, హైదరాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 15**

సామాజిక తెలంగాణ కోసం నిలబడినందుకే తనపై కుట్రలు చేసి బీఆర్ఎస్ నుంచి తనను బయటకు పంపించారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. ప్రతి ఒక్కరికి సమాన అవకాశాలు రావాలని పిలుపునివ్వడం తప్పా అని ఆమె ప్రశ్నించారు. భౌగోళికంగా తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నప్పటికీ, సామాజిక తెలంగాణను ఇంకా సాధించలేకపోయామని ఆమె వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌లో 'జాగృతి జనం బాట' యాత్ర పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ పోస్టర్‌పై తెలంగాణ తల్లి, ప్రొఫెసర్ జయశంకర్ చిత్రాలు ఉన్నాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సామాజిక చైతన్యం కోసమే ఈ యాత్ర అని స్పష్టం చేశారు. తమ దారులు వేరైనప్పుడు కేసీఆర్ ఫొటోను ఉపయోగించడం సముచితం కాదని భావించినట్లు తెలిపారు. ప్రత్యేక రాష్ట్రం వస్తే ప్రజల జీవితాలు బాగుపడతాయని అనేకమంది ప్రాణత్యాగాలు చేశారని కవిత అన్నారు. నాలుగు నెలల పాటు ఈ యాత్ర కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ యాత్రలో భాగంగా ప్రజల నుంచి సలహాలు, సూచనలు స్వీకరిస్తామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలు చాలా తెలివైనవారని, వారికి అన్నీ విషయాల పట్ల అవగాహన ఉంటుందని కవిత అన్నారు. యువత, మహిళలను మరింత చైతన్యవంతులను చేస్తామని ఆమె పేర్కొన్నారు.



# తొలి తెలుగు నేపథ్య గాయని రావు బాలసరస్వతీ దేవి కన్నుమూత

**- వృద్ధాప్య సమస్యలతో హైదరాబాద్‌లోని నివాసంలో తుదిశ్వాస**
**-జూబ్లీహిల్స్ మహాప్రస్థానంలో అంత్యక్రియలు.**
**- 'సతీ అనసూయ'తో బాలనటిగా పరిచయమై పలు చిత్రాల్లో నటన**

**సిద్దిపేట టైమ్స్, హైదరాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 15**



ఇప్పుడంటే పాట ఒకరిది... అందుకు తగ్గట్టు పెదాలు కదుపుతూ అభినయించేది మరొకరు. పాత రోజుల్లో నటులు ఎవరి పాట వాళ్లు సొంతంగా పాడుకోవాల్సిందే. అందుకే తొలితరం నటుల్లో చాలామంది స్వతహాగా గాయకులు కూడా! కాలక్రమంలో అచ్చం తెరపై కనిపించే నటుల్లాగే పాడుతూ... నేపథ్య గాయకులుగా ఎంతోమంది ఓ వెలుగు వెలిగారు. అలా తొలి తెలుగు నేపథ్యగాయనిగా చరిత్రకెక్కిన రావు బాలసరస్వతీ దేవి (97) కన్నుమూశారు. వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్న ఆమె బుధవారం ఉదయం హైదరాబాద్‌లోని నివాసంలో తుదిశ్వాస విడిచారు. సాయంత్రం జూబ్లీహిల్స్‌లోని మహాప్రస్థానంలో అంత్యక్రియలు జరిగాయి. 1928 ఆగస్టు 29న పార్థసారథి, విశాలాక్షి దంపతులకు జన్మించారు. చిన్న వయసులోనే పాటలు పాడటం మొదలుపెట్టారు బాలసరస్వతి. వివాహితుడైన, వెంకటగిరి సంస్థానానికి చెందిన ప్రద్యుమ్న కృష్ణ మహీపతి సూర్యారావు బహద్దూర్‌తో 15 ఏళ్ల వయసులో ఆమెకు పెళ్లయింది. తర్వాత ఆమె పాటకు దూరమయ్యారు. భర్త మరణించాక తిరిగి కొన్ని పాటలు పాడారు. ఈ దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆరేళ్ల వయసులోనే పాట అందుకున్న రావు బాలసరస్వతి... నటిగానూ పేరు తెచ్చుకున్నారు. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, సింహళ భాషల్లో 2వేలకు పైగా పాటలు పాడిన ఘనత ఆమెది. ఆలిండియా రేడియోలో తొలి లలిత సంగీత గాయనిగా, తొలి తెలుగు సినీ నేపథ్య గాయనిగా, తెలుగు సినిమాకు లలిత సంగీతాన్ని పరిచయం చేసిన కళాకారిణిగా బాలసరస్వతి చరిత్రలో నిలిచిపోయారు. తొలి తెలుగు సోలో గ్రామ్‌ఫోన్ రికార్డు కూడా ఆమెదే. 'భాగ్యలక్ష్మి' చిత్రంలో కమలా కోట్నీస్‌కు తన గాత్రాన్ని అందించి తొలి నేపథ్య గాయనిగా నిలిచారు బాలసరస్వతి. తిన్నెమీద సిన్నోడ... అంటూ సాగే ఆ పాటను భీమవరపు నరసింహారావు స్వరపరిచారు. 'సతీ అనసూయ' సినిమాతో ఆమె బాలనటిగానూ తెరకు పరిచయం అయ్యారు. 'భక్తధ్రువ', 'భక్త కుచేల', 'బాలయోగిని' తదితర చిత్రాల్లో బాలనటిగా మెరిసిన ఆమె... తర్వాత కథానాయికగానూ నటించారు.

## జూబ్లీహిల్స్ బీజేపీ అభ్యర్థి లంకల దీపక్ రెడ్డి

**సిద్దిపేట టైమ్స్, హైదరాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 15**



జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికకు బీజేపీ తన అభ్యర్థిని ప్రకటించింది. పార్టీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్ రెడ్డి(49)ని తమ అభ్యర్థిగా బీజేపీ నాయకత్వం ఖరారు చేసింది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి అరుణ్‌సింగ్ బుధవారం జారీ చేశారు. 2023 శాసనసభ ఎన్నికల్లో బీజేపీ తరపున జూబ్లీహిల్స్ నుంచి పోటీ చేసిన దీపక్ రెడ్డి 25,866 ఓట్లు సాధించి మూడో స్థానంలో నిలిచారు. ఆ ఎన్నికల్లో ఓటమిపాలైనప్పటికీ పార్లమెంట్ ఎన్నికల్లో కీలకంగా వ్యవహరించిన దీపక్ రెడ్డికే తిరిగి టికెట్ కేటాయించాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డితోపాటు రాష్ట్ర పార్టీ నాయకత్వం పట్టుబట్టింది. దీంతో అధిష్ఠానం దీపక్ రెడ్డికే టికెటు ఖరారు చేసింది. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక నవంబరు 11న జరగనుంది. 14వ తేదీన ఫలితం వెలువడనుంది.

# ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి

**- రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా త్వరితగతిన కొనుగోలు చేసిన ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించాలి**
**- వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టర్లకు అధికారులకు దిశా నిర్దేశం చేసిన మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు ఉత్తంకుమార్ రెడ్డి**

**సిద్దిపేట్ టైమ్స్ మెదక్ ప్రతినిధి అక్టోబర్ 15**

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, సిఎస్ రామకృష్ణా రావు ఇతర ఉన్నతాధికారులతో కలిసి ధాన్యం కొనుగోళ్లపై బుధవారం హైదరాబాద్ నుండి జిల్లా కలెక్టర్లు, వ్యవసాయ, సంబంధిత శాఖల అధికారులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా దిశానిర్దేశనం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ కి కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, అదనపు కలెక్టర్ నగేష్ ఆర్డీ ఓ లు, సివిల్ సప్లై, మార్కెటింగ్ అధికారులు హాజరయ్యారు. ఈ వీసీ లో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ... వరి పంట వినియోగం తెలంగాణలో ఎక్కువగా ఉందని, ఖరీఫ్ ప్రొక్యూర్మెంట్ ఎక్కువగా ఉంటుందని అన్నారు. ఇందుకొరకు అధికారులు అప్రమత్తం గా ఉండాలని, కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం కొనుగోలు కొరకు అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని, రవాణా సమస్యలు తలెత్తకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని, జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని, అలాగే రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా... కేంద్రాల్లో గన్నీ, ప్యాడీ క్లీనర్లు, తేమ కొలిచే మిషన్లు, ఎలక్ట్రానిక్ వేయింగ్ మిషన్లు తదితరాలు అందుబాటులో ఉండేలా చూడాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా కొనుగోలులో ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైతే పై అధికారులను గాని సంబంధిత మంత్రులను గాని సంప్రదించాలని సూచించారు గత రెండు పంటల కొనుగోలు







కేంద్రాలు విజయవంతంగా నిర్వహించడం జరిగిందని, అదే తరహాలో ఇప్పుడు కూడా కొనుగోలు జరిగేలా చూడాలని కోరారు. మిల్లర్లు సమస్యలు సృష్టించకుండా చర్యలు తీసుకోవాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ ఎంఎస్పీ, బోనస్ అందించడానికి సిద్ధంగా ఉందని, అందుకు అనుగుణంగా కొనుగోలు కేంద్రాల్లో సకాలంలో ట్యాబ్ ఎంట్రీ జరిగేలా చూడాలని ఆదేశించారు. క్వాలిటీ ప్రకారం కొనుగోలు జరగాలని, ఎఫ్సిఐ లతో పాటుగా ప్రైవేట్ గోడౌన్ లను అవసరాన్ని బట్టి వినియోగించుకోవాలని సూచించారు. మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర్ రావు మాట్లాడుతూ, దేశంలో పెద్ద ఎత్తున ధాన్యం కొనుగోళ్లు జరుగుతున్న రాష్ట్రం తెలంగాణ మాత్రమే అని, ఇప్పటి వరకు పద్ధతి ప్రకారం, ఎలాటి సమస్యలు లేకుండా ధాన్యం కొనుగోలు చేశామని, అదే విధంగా ఇప్పుడు కూడా సక్రమంగా ఏ రోజుకారోజు ధాన్యం కొనుగోలు చేయాలని, ధాన్యం కొనుగోలు చేయడంలో సమస్యలు లేకుండా అవసరాన్నిబట్టి ముందుగానే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించుకోవాలని, అకాల వర్షాలు పడే అవకాశం ఉన్నందున, అందుకు అనుగుణంగా కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. అధికారులు అప్రమత్తంగా ఉండి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వీసీ అనంతరం కలెక్టర్ రాహుల్ రాజ్ ఆర్డీవో లు, సివిల్ సప్లై,మార్కెటింగ్ తదితర శాఖ ల అధికారులతో సమీక్షించి... జిల్లాలో పూర్తి స్థాయి లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పూర్తిస్థాయిలో ప్రారంభించాలన్నారు. ప్రతీ కేంద్రం లో కనీస మౌలిక వసతులతో పాటు... సరిపడా గన్ని బ్యాగ్ లు, టార్పాలీన్, తేమ కొలిచే యంత్రాలు మొదలగునవన్నీ అందుబాటులో పెట్టుకోవాలన్నారు. ఆర్డీ వో లు, తహసీల్దార్ లు, సంబంధిత శాఖల జిల్లా స్థాయి అధికారులు ధాన్యం కొనుగోలు పూర్తి అయ్యేంత వరకు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తూ... సజావుగా ధాన్యం కొనుగోలు ప్రక్రియ ముగిసేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు



## డ్రగ్స్ రహిత మెదక్ జిల్లా గా తీర్చి దిద్దాలి

**- గంజాయి సాగు చేస్తే రైతు బంధు,ఇతర ప్రభుత్వ పథకాలు నిలుపు చేయాలి**
**- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**

**సిద్దిపేట్ టైమ్స్ మెదక్ ప్రతినిధి అక్టోబర్ 15**

డ్రగ్స్ రహిత మెదక్ జిల్లా గా తీర్చి దిద్దాలనీ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులకు సూచించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయం లోని మినీ సమావేశ మందిరంలో జిల్లా Sp D.V శ్రీనివాస్ రావు,జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ జిల్లాలో డ్రగ్స్ నిర్మూలించాలన్నారు. గ్రామాల్లో డ్రగ్స్ వ్యతిరేక కమిటీలు వేయాలన్నారు. గంజాయి సాగు చేస్తే రైతు బంధు,ఇతర ప్రభుత్వ పథకాలు నిలుపు చేయాలన్నారు. రైతు వేదికల వద్ద గంజాయి సాగు చేస్తే జరిగే పరిణామాలను రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతి పాఠశాల ,కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల్లో, పట్టణాల్లో వివిధ కూడళ్ల వద్ద ,మెడికల్ షాప్ లు,పరిశ్రమల వద్ద తనిఖీలు చేయాలన్నారు. జిల్లా Sp డి వి శ్రీనివాస్ రావు మాట్లాడుతూ డాబాలు వద్ద,వివిధ రాష్ట్రాల నుంచి పరిశ్రమలకు ఉపాధి కోసం వచ్చే వారిని క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ఈ కార్యక్రమం లో అదనపు కలెక్టర్ నగేష్,జిల్లా అధికారులు పాల్గొన్నారు.



## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి

**సిద్దిపేట టైమ్స్ దౌల్తాబాద్**

దౌల్తాబాద్ పట్టణ బిఆర్ఎస్ అధ్యక్షుడు ఉమ్మడి నర్సింహారెడ్డి తల్లి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన నేపథ్యంలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి బుధవారం దౌల్తా బాద్ పట్టణానికి విచ్చేసి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నర్సింహారెడ్డి కుటుంబ సభ్యులతో మాట్లాడి వారిని ఓదార్చారు. కుటుంబానికి తన సానుభూతి తెలియజేస్తూ, “తల్లిని కోల్పోవడం ఎంతో బాధాకరమైన విషయం. మీ కుటుంబానికి బలం కావడంలో నేను ఎల్లప్పుడూ తోడుంటాను” అని అన్నారు. ఎమ్మెల్యే ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ, పార్టీ కార్యకర్తల మధ్య బంధం కుటుంబ సభ్యుల మాదిరిగానే ఉందని, ప్రతి బాధలోనూ, సంతోషంలోనూ బిఆర్ఎస్ కుటుంబం ఒకటిగా ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు సయ్యద్ రహీమొద్దీన్, నాయకులు రణం శ్రీనివాస్ గౌడ్, అప్పవారి శ్రీనివాస్, పబ్బ అశోక్ గుప్తా, నాగరాజు వెంకటేశం, సయ్యద్ అబ్దుల్ గఫ్ఫార్ తదితరులు పాల్గొన్నారు. స్థానిక నాయకులు ఎమ్మెల్యే ప్రభాకర్ రెడ్డి పట్ల కృతజ్ఞతలు తెలియజేశారు. గ్రామస్థులు కూడా ఎమ్మెల్యేను కలుసుకొని తమ సమస్యలను వివరించారు. ఎమ్మెల్యే వాటిని శ్రద్ధగా విని పరిష్కారానికి హామీ ఇచ్చారు. ఈ పరామర్శ కార్యక్రమం ప్రశాంతంగా సాగింది.

# విద్యార్థులలోని అంతర్గత కళలను వెలికి తీయాలి

**- జిల్లా విద్యాశాఖాధికారి రాధా కిషన్**

**సిద్దిపేట్ టైమ్స్ మెదక్ ప్రతినిధి అక్టోబర్ 15**

విద్యార్థులలోని అంతర్గత కలలను చదువు తో పాటు వెలికి తీయాలని జిల్లా విద్యాశాఖ అధికారి ప్రొఫెసర్ రాధా కిషన్ అన్నారు. మెదక్ పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం నాడు విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి జానపద నృత్య పోటీలు నిర్వహించారు . ఈ పోటీలలో గెలుపొందిన విజేతలకు ఆయన మెమెంటోలు ప్రశంసా పత్రాలను అందించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విద్యా పరిశోధన మరియు శిక్షణ సంస్థ ఆదేశానుసారం జిల్లా స్థాయిలో జానపద నృత్య పోటీలు నిర్వహించామని విద్యార్థులలోని కళా నైపుణ్యాలను వెలికి తీయాలని అన్నారు. ఈ పోటీలను విద్యా







శాఖ అకాడమిక్ మానిటరింగ్ అధికారి సుదర్శన్ మూర్తి పర్యవేక్షించారు. ఈ పోటీలలో ప్రథమ స్థానం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కుకునూరు కైవసం చేసుకోగా , ద్వితీయ స్థానం కొడిపల్లి బాలికల ఉన్నత పాఠశాల , తృతీయ స్థానం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కాళ్ళకల్ కు దక్కింది. ఈ పోటీలలో ప్రథమ స్థానం పొందిన కుకునూరు పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా మెదక్ మండల విద్యాధికారి శంకర్ , ప్రధానోపాధ్యాయులు రామేశ్వర్ ప్రసాద్ రేఖ ,అంజాగౌడ్ ,వంశీ వ్యవహరించారు.



## మాజీ ఎంపీపీ సంధ్యా రవీందర్ కుటుంబాన్ని పరామర్శించిన జర్నలిస్టులు

**సిద్దిపేట టైమ్స్ దౌల్తాబాద్**

దౌల్తాబాద్ మండలానికి చెందిన మాజీ ఎంపీపీ సంధ్యా రవీందర్ తల్లి ఇటీవల మృతి చెందిన విషయం తెలుసుకున్న మండల జర్నలిస్టులు బుధవారం వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబానికి జరిగిన ఈ అనూహ్య నష్టం పట్ల సంతాపం వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కుటుంబ పెద్దను కోల్పోవడం ఏ ఇంటికైనా ఎంతో బాధాకరమైన విషయం అని పేర్కొన్నారు. తమతో సాన్నిహిత్యం ఉన్న సంధ్యా రవీందర్ కుటుంబం ఎదుర్కొంటున్న ఈ దుఃఖ సమయంలో మీడియా మిత్రులంతా వారి పక్కనే నిలుస్తారని తెలిపారు. కుటుంబ సభ్యులు మానసికంగా ధైర్యంగా ఉండాలని, దైవం వారి కుటుంబానికి శాంతి, ఓర్పు ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఈ పరామర్శ కార్యక్రమంలో దౌల్తాబాద్ ప్రెస్క్లబ్ అధ్యక్షుడు లింగాల రాజిరెడ్డి, గౌరవ అధ్యక్షుడు బ్యాగరి శంభులింగం, ప్రధాన కార్యదర్శి గణేష్ పంచమి, కోశాధికారి ముద్రకోళ్ళ యాదగిరి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పత్రికారంగానికి చెందిన అనేక మంది జర్నలిస్టులు కూడా హాజరై సంతాపం తెలిపారు. సంధ్యా రవీందర్ కుటుంబ సభ్యులు జర్నలిస్టుల పరామర్శకు కృతజ్ఞతలు తెలియజేశారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలి

**- బ్లాక్ స్పాట్స్ ను గుర్తించాలి**
**- విలువైన ప్రాణాలను కాపాడాలి**
**- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**

**సిద్దిపేట్ టైమ్స్, మెదక్ ప్రతినిధి, అక్టోబర్ 15**

బుధవారం కలెక్టరేట్ లో ని మినీ సమావేశ మందిరంలో రోడ్డు భద్రత పై జిల్లా స్థాయి అధికారులతో సమన్వయ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను తగ్గించడంలో రహదారి భద్రతా చర్యలు కీలకమైనవని అన్నారు. ఈ చర్యలను తీసుకోవడంలో అన్ని శాఖల మధ్య సమన్వయం అవసరమని, ప్రతి శాఖ సమిష్టిగా క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సూచించారు. జిల్లాలో ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను (బ్లాక్ స్పాట్లు) గుర్తించి ప్రమాదాలను నివారించేందుకు సమగ్ర చర్యలు చేపట్టాలన్నారు. నేషనల్ హైవే మీద ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రమాదాలు జరిగేందుకు అవకాశం ఉన్నచోట్ల ప్రమాద సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. మానవ తప్పిదాలు, వాహనాలు, అత్యధిక వేగం వలన రోడ్డు ప్రమాదాలు సంభవిస్తాయన్నారు. రోడ్లపై రుంబుల్ స్ట్రిప్స్, స్టడ్స్, సూచిక బోర్డులు, బ్లింకర్స్ వంటి రహదారి సూచనలు ఏర్పాటు చేయాలని సూచించారు. రహదారి ఇరువైపులా పెద్దగా ఉన్న చెట్లను తొలగించాలన్నారు. పెద్ద చెట్ల వలన లైటింగ్ కనిపించకుండా ఉంటుందన్నారు.ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు అన్ని శాఖల మధ్య సమన్వయంతో జిల్లాల్లో రోడ్డు ప్రమాదాలు సంభవించకుండ పటిష్టంగా ఏర్పాట్లు చేయాలన్నారు. అధిక వేగం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని, వేగ పరిమితిని ఖచ్చితంగా అమలు చేయాలన్నారు. జిల్లా ఎస్పీ. శ్రీనివాస్ రావు మాట్లాడుతూ ఎక్కువగా ప్రమాదాలు జరిగే స్పాట్స్ ని గుర్తించాలన్నారు. రోడ్డులు సరిగా



లేని చోట్ల, వెంటనే మరమ్మతులు చేయించాలన్నారు. ఎక్కువగా ప్రమాదాలు జరిగే చోట సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు



## సూపర్ మార్కెట్ ను ప్రారంభించిన దుబ్బాక ఎమ్మెల్యే

**సిద్దిపేట టైమ్స్ దౌల్తాబాద్**

రాయపోల్ మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన తాజా మాజీ ఎంపీపీ కల్లూరి అనిత శ్రీనివాస్ యొక్క గాయత్రి సూపర్ మార్కెట్ మరియు పూజా సామాగ్రి దుకాణ సముదాయాన్ని గజ్వేల్ పట్టణంలో బుధవారం దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. అనంతరం సూపర్ మార్కెట్ లో తిరిగి వస్తువులను పరిశీలించి కొంత సామాగ్రిని కొనుగోలు చేశారు. అలాగే మాజీ ఎంపీపీ కల్లూరి అనిత శ్రీనివాస్ దంపతులను సత్కరించి ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలు రాయపోల్ ఎంపీపీగా మండల ప్రజలకు సేవలు అందించి దిగ్విజయంగా పదవి పూర్తిచేసుకుని ఇప్పుడు వ్యాపార రంగంలో అడుగుపెట్టిన అనిత శ్రీనివాస్ దంపతులు వ్యాపార రంగంలో కూడా రాణిస్తూ అభివృద్ధి చెందాలని కోరుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు వెంకటేశ్వర శర్మ, తాజా మాజీ జెడ్పిటిసి లింగాయపల్లి యాదగిరి, సీనియర్ నాయకులు రణం శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర యువజన విభాగం నాయకులు రాజీరెడ్డి, రైతుబంధు మాజీ అధ్యక్షులు మున్నా, మాజీ కోఆప్షన్ సభ్యులు పర్వేజ్, మాజీ సర్పంచ్ కరుణాకర్, నాయకులు మల్ల గౌడ్, బాల్ నర్స్, లక్ష్మారెడ్డి, మల్లేశం, తాడేం కృష్ణ, దుర్గయ్య, శ్రీనివాస్, రాజు, రాజా నర్స్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

# మాచిన్‌పల్లి మల్లన్నగుట్ట వద్ద చిరుత పులి సంచారం

**– గ్రామంలో ఆందోళన**

**సిద్దిపేట టైమ్స్ దౌల్తాబాద్**

మండల పరిధిలోని మాచిన్‌పల్లి గ్రామ సమీపంలోని మల్లన్నగుట్ట ప్రాంతంలో చిరుత పులి సంచారం కలకలం రేపింది. మంగళవారం సాయంత్రం పొలాల వద్దకు వెళ్లిన రైతులు పొదల్లో చిరుత పులి కనిపించిందని తెలిపిన వెంటనే గ్రామంలో ఆందోళన నెలకొంది. సమాచారం అందుకున్న అటవీ శాఖ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిసర ప్రాంతాలను పరిశీలించారు. చిరుత పులి జాడలను గుర్తించేందుకు అధికారులు మల్లన్నగుట్ట పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక కెమెరాలను ఏర్పాటు చేశారు. గ్రామ ప్రజలు రాత్రి సమయంలో ఒంటరిగా బయటకు వెళ్లరాదని, పశువులను





పొలాల వద్ద కట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అటవీ అధికారులు హెచ్చరించారు. అలాగే రైతులు మరియు గ్రామస్తులు అప్రమత్తంగా ఉండి, చిరుత కనిపించిన వెంటనే సమీప అటవీ లేదా పోలీస్ అధికారులకు సమాచారం అందించాలని సూచించారు.






# ద్విచక్ర వాహనం అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

**- రోడ్డు ప్రమాదాలు క్షణాల్లో సంభవిస్తాయి**
**- జాగ్రత్తే రక్షణ**

**సిద్దిపేట టైమ్స్ దౌల్తాబాద్**

రాయపోల్ మండలం వడ్డేపల్లి గుర్రాలసోపా సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి గాయాలైన సంఘటన చోటుచేసుకుంది. తూప్రాన్ మండలం కోనాయిపల్లి గ్రామానికి చెందిన ఉప్పరి సత్తయ్య పనుల నిమిత్తం గజ్వేల్‌కి వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తుండగా, వడ్డేపల్లి గుర్రాలసోపా సమీపంలో తన ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో ఆయనకు తలకు గాయాలయ్యాయి. సంఘటనను గమనించిన స్థానికులు వెంటనే స్పందించి 108 అంబులెన్స్ ద్వారా గజ్వేల్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఆర్వీఎం ఆసుపత్రికి తరలించారు. స్థానికులు మాట్లాడుతూ — ఇటీవలి కాలంలో రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్న నేపథ్యంలో వాహనదారులు మరింత అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా వేగం, రోడ్డు పరిస్థితుల పట్ల జాగ్రత్తగా ఉండటం ద్వారా ప్రాణాలను కాపాడుకోవచ్చని సూచించారు.



# బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

**సిద్దిపేట్ టైమ్స్ రామాయంపేట అక్టోబర్ 15**

నిజాంపేట మండల పరిధిలోని కల్వకుంట గ్రామానికి చెందిన బత్తులరేణుక, ఇటీవల అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకోవడం జరిగింది. ఇట్టి విషయాన్ని తెలుసుకున్న భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు కలచ్చు గారి రాజిరెడ్డి, మృతురాలి కుటుంబానికి 5 వేల రూపాయల ఆర్థిక సాయాన్ని అందించారు.ఈ కార్యక్రమంలో బూత్ అధ్యక్షులు మంగలి లక్ష్మణ్,బాస రాములు,గజం రాజు,రవీందర్ రెడ్డి,డీలర్ రాజు,మేకల రాజు,ఉషన్న శంకర్,బత్తుల రాజు,భూరాని లక్ష్మీ నర్స్,కుంచలరాజు, తదితరులు పాల్గొన్నారు.



# మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం..

**సిద్దిపేట్ టైమ్స్ రామాయంపేట అక్టోబర్ 15**

నిజాంపేట మండల కేంద్రానికి చెందిన విభూతి జ్యోతి (40) గత రెండు రోజుల క్రితం మనస్థాపంతో ఉరివేసుకొని చనిపోవడం జరిగింది. నిరుపేద కుటుంబమైన వారి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి పంజా మహేందర్ ఆయన సన్నిహితుల ద్వారా మృతు రాలి కుటుంబానికి 5వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నసీరుద్దీన్,సామల మహేష్, పెద్ద పైడి రాజిరెడ్డి, స్వామి తదితరులు పాల్గొన్నారు.



# ప్రత్యేక తరగతులను ఆకస్మిక తనిఖీ

**- మండల విద్యాధికారి గజ్జెల కనకరాజు**

**సిద్దిపేట టైమ్స్ దౌల్తాబాద్**

దౌల్తాబాద్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పదవ తరగతి ప్రత్యేక తరగతుల నిర్వహణను మండల విద్యాధికారి గజ్జెల కనకరాజు బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి వారి చదువు పరిస్థితిని తెలుసుకున్నారు. వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఇప్పటి నుంచే ప్రత్యేక ప్రణాళికతో కృషి చేయాలని సూచించారు. క్రమశిక్షణ, సమయపాలన, పునరావృతం ద్వారా మంచి మార్కులు సాధించవచ్చని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయులు సంజీవ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, సిఆర్పి గాడి రాజు, ముత్యం గారి చంద్రమౌళి పాల్గొన్నారు.







# సిద్దిపేట జిల్లా అధ్యక్ష పదవికి నామినేషన్లు

**సిద్దిపేట టైమ్స్ చేర్యాల ప్రతినిధి :**

సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మంజె మల్లేశం, జక్కిరెడ్డి సుదర్శన్ రెడ్డి లు బుధవారం తమ నామినేషన్ లు దాఖలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీకి, ప్రజలకు తాము చేసిన సేవలు గుర్తించి సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా తమకు అవకాశం కల్పించాలని వారు కోరారు. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తలు వారి అభ్యర్థనకు సహకరిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ధాన్య కొనుగోలు పక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్ కె. హైమావతి

**సిద్దిపేట టైమ్స్, సిద్దిపేట, అక్టోబర్ 15**

బెజ్జంకి మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ గోదాంలో వరి ధాన్య కొనుగోలు ప్రక్రియను జిల్లా కలెక్టర్ కె. హైమావతి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.
క్రితం సీజన్ లో 12 వేల క్వింటాల పైగా వరి ధాన్యం కొన్నామని ఏఎంసి ప్రాంతంలో వరి కోతలు మొదలయ్యాయని సిబ్బంది కలెక్టర్ కి తెలిపారు. ఏఎంసి మొత్తం కలియ తిరిగారు. ప్రభుత్వం నిర్దేశించిన తేమశాతం రాగానే గన్నిల్లో నింపాలని ఆదేశించారు. తేమశాతం చెక్ చేశారు తేమశాతం వచ్చిన కూడా గన్ని లలో నింపట్లేదని అడగ్గా ధాన్యం ఆన్ లోడింగ్ మిల్లు కేటాయించలేదని సెంటర్ సిబ్బంది తెలపగా వెంటనే అన్ని వరిధాన్య కొనుగోలు కేంద్రాలకు ఆయా దగ్గరలోని రైస్ మిల్లను కేటాయించే ప్రక్రియను త్వరగా పూర్తి చెయ్యాలని డీసీఎస్ఓ నీ ఫోన్ ద్వారా ఆదేశించారు. ఏఎంసి లోపల శుభ్రంగా ఉంచాలనీ తాగునీటి వసతి, టార్పలిన్ కవర్లు, పాడి క్లీనర్ లు, గన్ని బ్యాగులు ఇతర అన్ని సౌకర్యాలు అందుబాటు లో ఉంచుకోవాలని తెలిపారు. ఈ సీజన్ లో జిల్లా





మొత్తం 6లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం వస్తుందని అంచనా వేస్తున్నామని రైతులు ఎవ్వరు దళారుల వద్దకు వెళ్లి నష్టపోకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే వరి ధాన్యం అమ్ముకోవాలని, బ్యాంక్ అకౌంట్, ఫోన్ నెంబర్ లింక్, ఆధార్ అప్డేట్ చేసుకుంటే పేమెంట్ లో ఎలాంటి సాంకేతిక సమస్యలు రావని రైతులకు పిలుపునిచ్చారు. అనంతరం బెజ్జంకి మండల కేంద్రంలోని పలు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బండి పల్లి మణెమ్మ ఇళ్లు పరిశీలిస్తూ బాగా కట్టుకుంటున్నారని ఎన్ని బిల్లులు వచ్చాయని కలెక్టర్ అడగ్గా 3 బిల్లులు 4 లక్షలు వచ్చాయనీ మొత్తం నిర్మాణం పూర్తి కాగానే ఫైనల్ క్యాప్చర్ చేస్తానని ఏ ఈ హౌసింగ్ కలెక్టర్ కి తెలిపారు. అలాగే బండి పల్లి రాజవ్వ ఇంటిని పరిశీలిస్తూ నిర్మాణం వేగంగా పూర్తి చెయ్యాలని పేమెంట్ గూర్చి కలెక్టర్ అడగ్గా 2 బిల్లులు 2 లక్షలు అకౌంట్ లో పడ్డాయని స్లాప్ పే మెంట్ క్యాప్చర్ చేశానని ఏ ఈ కలెక్టర్ కి తెలిపారు. ఇంటి నిర్మాణం పూర్తి చేసుకుంటే పేమెంట్ లో ఎలాంటి సమస్యలు లేవని తప్పకుండా అకౌంట్ లో జమ అవుతాయని లబ్ధిదారులకు సూచించారు. కలెక్టర్ వెంట తహసిల్దార్ శ్రీకాంత్, ఎంపిడిఓ తదితరులు ఉన్నారు.

# రాష్ట్ర స్థాయివాలీబాల్ పోటీలకు రాయపోల్ జెడ్పీ హై స్కూల్ విద్యార్థులు ఎంపిక

**- ముగ్గురు ప్రతిభావంతులకు ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు అభినందనలు**

**సిద్దిపేట టైమ్స్ దౌల్తాబాద్**

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో రాయపోల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు ఆనందం వ్యక్తం చేశారు. బుధవారం పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన సమావేశంలో ప్రధానోపాధ్యాయులు విద్యార్థులను సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ - "మా విద్యార్థులు క్రమశిక్షణ, కృషి, శ్రమతో ఈ స్థాయి వరకు రావడం పాఠశాల గర్వకారణం. క్రీడలు విద్యార్థుల మానసిక, శారీరక వికాసానికి దోహదపడతాయి," అని తెలిపారు. గజ్వేల్‌లో జరిగిన జోనల్ స్థాయి వాలీబాల్ పోటీల్లో అండర్-14 విభాగంలో ద్వితీయ స్థానం సాధించి, రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులు ఏ. యశ్వంత్, జీ. సౌమ్యలు కాగా, అండర్-19 విభాగంలో సంగారెడ్డిలో జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీలకు ఏ. సాంజనా ఎంపిక కావడం పాఠశాలకు గర్వకారణమని ఆయన అన్నారు. విద్యార్థుల ఎంపికలో కీలకపాత్ర పోషించిన వ్యాయామ ఉపాధ్యాయుడు గోవర్ధన్ రెడ్డి కృషిని వెంకటేశ్వర్లు ప్రశంసించారు. "విద్యార్థులలో క్రీడాస్ఫూర్తిని నింపి మార్గనిర్దేశం చేసిన గోవర్ధన్ రెడ్డి dedication పాఠశాలకు ఆదర్శం," అని పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో విజయం సాధించాలని సంకల్పంతో విద్యార్థులు కసరత్తులు ప్రారంభించారు. సహ విద్యార్థులు, ఉపాధ్యాయులు వారిని అభినందించి ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగరాజు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.



# బిఆర్ఎస్ శ్రేణుల ఆధ్వర్యంలో బాకీ కార్డుల పంపిణీ..

**సిద్దిపేట్ టైమ్స్ రామాయంపేట అక్టోబర్ 15**

నిజాంపేట మండలంలోని తిప్పనగుల్ల గ్రామంలో బుధవారం కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను ఎండగడుతూ బాకీ కార్డులను ఇంటింటికి తిరుగుతూ గ్రామస్తులకు అందజేశారు.ఈ సందర్భంగా బిఆర్ఎస్వి నియోజకవర్గ అధ్యక్షుడు రంజిత్ గౌడ్ మాట్లాడుతూ.కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ప్రజలకు మోసపూరిత హామీలతో గద్దెనెక్కిందని బిఆర్ఎస్ రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ హామీలను నెరవేర్చాలని భాకీ కార్డుల ద్వారా ప్రజలకు చేరవేస్తున్నామన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం 22 నెలల పాలనలో 6 గ్యారంటీల అమలులో విఫలమైందన్నారు.ఈ కార్యక్రమంలో తిప్పనగుల్ల మాజీ సర్పంచులు రెడ్డిశెట్టి రవీందర్,యాదగిరి, నాయకులు గోపరి ఎల్లం, రాజ్యం,రవి,లింగం, చంద్రం, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# తూతూ మంత్రం గా మధ్యాహ్న భోజన మెనూ






**సిద్దిపేట అర్బన్,సిద్దిపేట టైమ్స్,అక్టోబర్ 15:**

ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు హాస్టల్ విద్యార్థులకు మెనూ తప్పనిసరిగా పాటించి విద్యార్థులకు ఆహారాన్ని అందించాల్సిన ఉపాధ్యాయ బృందం తూతూ మంత్రంగా నిర్వహిస్తూ విద్యార్థులకు కష్టాలు తెచ్చిపెడుతున్నారు. ఈ విషయమై కలెక్టర్ స్వయంగా పర్యటించి ఉపాధ్యాయురాలను సస్పెండ్ చేసిన ఇంకా పాఠశాలల తీరు మారలేదు. సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి ప్రభుత్వ పాఠశాలలో నామమాత్రంగానే మెనూ పాటిస్తూ విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని అందిస్తున్నారని తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే మార్కెట్లో కూరగాయల ధరలు విపరీతంగా ఉన్నాయని , మెస్ చార్జీలు రాక మూడు నెలలు అవుతుందని మధ్యాహ్న భోజనాన్ని వండేవారు సమాధానమిస్తున్నారని విద్యార్థులు తల్లిదండ్రులు చెబుతున్నారు. కొన్ని సందర్భాలలో అయితే కుళ్ళిపోయిన కోడిగుడ్లు కేవలం నీళ్ల చారు మాత్రమే చేస్తున్నారని పాఠశాల విద్యార్థులు ఆవేదన చెందుతున్నారు. మధ్యాహ్న భోజనాన్ని వడ్డించే సమయంలో ఎండలో నిలబెట్టి వడ్డిస్తున్నారని డైనింగ్ హాల్లో విరిగిపోయిన కుర్చీలు బెంచీలు వేసి స్టోర్ రూమ్ మార్చారని ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయమై ఉపాధ్యాయులను ప్రశ్నిస్తే హై స్కూల్ సెక్షన్లో మధ్యాహ్న భోజనం వండేవారు పాఠశాల ప్రారంభమైనప్పటి నుండి లేకపోవడంతో ప్రైమరీ సెక్షన్ లో వండేవారితోనే సర్దుకుపోతున్నామని ఇబ్బంది ఉన్న మాట నిజమేనని తెలిపారు. కలెక్టర్ ప్రతిష్టాత్మకంగా పర్యటిస్తూ విద్యార్థుల బాగోగులు చూసుకుంటున్న కూడా మరికొన్ని పాఠశాల తీరు మారకపోవడం పట్ల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# రేవా రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్యాండిల్స్ ర్యాలీ

**సిద్దిపేట టైమ్స్, సిద్దిపేట, అక్టోబర్ 15**

రేవా రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నేడు సాయంత్రం 5 గంటలకు స్థానిక అంబేద్కర్ సర్కిల్ వద్ద క్యాండిల్స్ ర్యాలీ ఉంటుందని అధ్యకుడు పోనమల్ల రాములు, ప్రార్థన కార్యదర్శి ఎండీ సలీమ్ తెలిపారు. రిటైర్ అయి 18 నెలలు కావస్తున్న ఒక్క పైసా కూడా ఇవ్వక పెన్నర్లను ఆర్థికంగా, మానసికంగా ఇబ్బంది పెట్టడం వలన పెన్షనర్లు చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నారని తెలిపారు. కొందరు చనిపోయరని, చనిపోయిన వారి ఆత్మకు శాంతి కలగాలని ప్రభుతానికి కనువిప్పుకలగలని ఈ క్యాండిల్స్ ర్యాలీని తీస్తున్నాం అన్నారు. ఈ ర్యాలిని



జిల్లాలోని రిటైర్డ్ అయిన బకాయిలు రాని ఉద్యోగులు, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# నీట మునిగి వ్యక్తి మృతి

**సిద్దిపేట్ టైమ్స్ మెదక్ ప్రతినిధి అక్టోబర్ 15**

ప్రమాదవశత్తు మోటార్ పైపు సరిచేస్తూ మంజీర నదిలో మునిగి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని కుర్తివాడలో చోటుచేసుకుంది. ఎస్సై సారా శ్రీనివాస్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన పక్రమొల్ల ఆబేద్ 53 గ్రామ శివారులో భూమిని కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. పంట ఎండిపోవడంతో మోటార్ సరి చేయడానికి గ్రామానికి చెందిన మరో వ్యక్తితో కలిసి మంజీర నది ఒడ్డుకు చేరుకున్నారు. అక్కడ మోటర్ పైపు సరి చేస్తూ ఆబేద్ నీతమునిగాడు. ఎంతటికి పైకి రాకపోవడంతో అక్కడే ఉన్న మరో వ్యక్తి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మంగళవారం సాయంత్రం మంజీరా నదిలో వెతికినప్పటికీ మృతదేహం ఆచూకీ దొరకలేదు. బుధవారం ఉదయం మరోసారి వెతకగా ఆబేదు



మృతదేహం లభ్యమైనది. ఆబేద్ భార్య సహనాజ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు



# శ్రీ రాజరాజేశ్వరి చిల్డ్రన్స్ ఆసుపత్రి వైద్యుల మెరుగైన సేవలు

**సిద్దిపేట్ టైమ్స్ రామాయంపేట అక్టోబర్ 15**

రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ రాజ రాజేశ్వరి చిల్డ్రన్స్ మరియు కంటి ఆసుపత్రి మెరుగైన వైద్య సేవలు అందిస్తూ పేషంట్ల మన్ననలను చూరగొంటున్నారు. వివరాల్లోకి వెళితే విపరీతమైన జ్వరం కారణంగా ప్లేట్ లెట్స్ కౌంట్ గణనీయంగా తగ్గిన రామాయంపేట పట్టణానికి చెందిన అఖిలేష్ అనే బాలుడికి మెరుగైన వైద్య సేవలు అందించి స్వస్థత చేకూర్చారు. ఆస్పత్రి పిల్లల వైద్యనిపుందు డాక్టర్ ప్రదీప్ రావు పర్యవేక్షణలో బాలుడికి మెరుగైన చికిత్స అందించి సాధారణ స్థితికి చేరుకునేలా చేశారు. అఖిలేష్ ఆరోగ్యం పూర్తిగా మెరుగుపడటంతో బుధవారం ఆస్పత్రి నుంచి డిశ్చార్జి చేశారు. ఈ సందర్భంగా అఖిలేష్ తల్లిదండ్రులు మెరుగైన వైద్య సేవలు అందించిన డాక్టర్ ప్రదీప్ రావుకు కృతజ్ఞతలు తెలియజేశారు. మెరుగైన వైద్య సేవలు అందిస్తున్న శ్రీ రాజరాజేశ్వరి పిల్లల ఆసుపత్రి వైద్యులను పట్టణ ప్రజలతోపాటు మండల ప్రజలు అభినందిస్తున్నారు.

# దేశంలో ఎక్కువ ఖరీఫ్ ప్రొక్యూర్మెంట్ ఉంటుంది..





**- మంత్రి తుమ్మల నాగేశ్వర రావు**
**ధాన్యం కొనుగోళ్లపై మంత్రుల సమీక్ష..**
**సిద్దిపేట టైమ్స్, సిద్దిపేట అక్టోబర్ 15**

రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ, మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, ఇరిగేషన్ మరియు పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమకుమార్ రెడ్డి, మత్స్య మరియు క్రీడల శాఖ మంత్రి వాకాటి శ్రీహరి, సిఎస్ రామకృష్ణా రావు ఇతర ఉన్నతాధికారులతో కలిసి ధాన్యం కొనుగోళ్లపై బుధవారం ఉదయం హైదరాబాద్ నుండి జిల్లా కలెక్టర్లు, వ్యవసాయ మరియు సంబంధిత శాఖల అధికారులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా దిశానిర్దేశనం చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్యాడి వినియోగం తెలంగాణలో ఎక్కువగా ఉందని, భారత దేశంలో ఎక్కువ ఖరీఫ్ ప్రొక్యూర్మెంట్ ఉంటుందని అన్నారు. ఇందుకొరకు అధికారులు అప్రమత్తం గా ఉండాలని, కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం కొనుగోలు కొరకు ఏర్పాట్లు చేసుకోవాలని, ట్రాన్స్పర్ట్ సమస్యలు తలెత్తకుండా కలెక్టర్ , ఎస్పీలు జాగ్రత్తలు తీసుకోవాలని, జిల్లాలో అవసరం మేర ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని, అలాగే రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కేంద్రాల్లో గన్నీ, ప్యాడీ క్లీనర్లు, మాయిచర్ మిషన్లు, ఎలక్ట్రానిక్ వేయింగ్ మిషన్లు తదితరాలు అందుబాటులో ఉండేలా చూడాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా కొనుగోలులో ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైతే పై అధికారులను గాని సంబంధిత మంత్రులను గాని సంప్రదించాలని సూచించారు. గత రెండు పంటల కొనుగోలు కేంద్రాలు విజయవంతంగా నిర్వహించడం జరిగిందని, అదే తరహాలో ఇప్పుడు కూడా కొనుగోలు జరిగేలా చూడాలని కోరారు. మిల్లర్లు సమస్యలు సృష్టించకుండా చర్యలు తీసుకోవాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ ఎంఎస్పీ, బోనస్ అందించడానికి సిద్ధంగా ఉందని, అందుకు అనుగుణంగా కొనుగోలు కేంద్రాల్లో సకాలంలో ట్యాబ్ ఎంట్రీ జరిగేలా చూడాలని ఆదేశించారు. క్వాలిటీ ప్రకారం కొనుగోలు జరగాలని, ఎఫ్సిఐ లతో పాటుగా ప్రైవేట్ గోడౌన్ లను అవసరాన్ని బట్టి వినియోగించుకోవాలని సూచించారు. మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు మాట్లాడుతూ, దేశంలో పెద్ద ఎత్తున ధాన్యం కొనుగోళ్లు జరుగుతున్న రాష్ట్రం తెలంగాణ మాత్రమే అని, ఇప్పటి వరకు పద్ధతి ప్రకారం, ఎలాటి సమస్యలు లేకుండా ధాన్యం కొనుగోలు చేశామని, అదే విధంగా ఇప్పుడు కూడా సక్రమంగా ఏ రోజు కారోజు ధాన్యం కొనుగోలు చేయాలని, ధాన్యం కొనుగోలు చేయడంలో సమస్యలు లేకుండా అవసరాన్నిబట్టి ముందుగానే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించుకోవాలని, అకాల వర్షాలు పడే అవకాశం ఉన్నందున, అందుకు అనుగుణంగా కేంద్రాల వద్ద అన్ని అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని, రైతులు కుర్చోడానికి మంచినీటి సమస్యలు రాకుండా చూడాలని, దీపావళి పండుగ తరువాత మొక్క జొన్న, సోయా పంటలను కూడా వస్తాయి కాబట్టి అధికారులు అప్రమత్తంగా ఉండి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ప్రతినిధులతో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం అధికారులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించి, కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించడంతో పాటుగా తరచు తనిఖీలు నిర్వహించాలని, ఎక్కడ ట్రాన్స్పర్ట్ సమస్యలు లేకుండా చూడాలని, గన్ని బ్యాగులు అన్నిచోట్ల అందుబాటులో ఉండేలా చూడాలని, ధాన్యం సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా, అవరాన్ని బట్టి ట్రాక్టర్లను కూడా వినియోగించుకోవాలని, ఈ అనుమతి కొరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాలని సూచించారు. హమాలీ సమస్యలు లేకుండా చూడాలని, మిల్లుల వద్ద ధాన్యం దిగుమతి చేసుకోవడంలో ఆలస్యం జరగకుండా మిల్లర్లకు ఖచ్చితమైన ఆదేశాలు జారీ చేయాలని, మిల్లులను తరచు తనిఖీలు చేయాలని, రైతుల బ్యాంకు ఖాతా, మొబైల్ నెంబర్, ఆధార్ నెంబర్ వివరాలు మరోసారి సరిచూసుకోవాలని, కేంద్రాల్లో స్పేస్ సమస్య లేకుండా చూడాలని, జిల్లాలో ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలను స్థానిక ప్రజాప్రతినిధులతో ప్రాంభించేలా చూడాలని సూచించారు. జిల్లాలో ప్యాడీ కొనుగోలులో సమస్యలు ఉంటే ఫిర్యాదు చేయడానికి 7995050809 నంబర్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, డిఆర్డిఓ జయదేవ్ ఆర్య, జిల్లా పౌరసరఫరాల అధికారి తనూజ, డిఎం సివిల్ సప్లై ప్రవీణ్, జిల్లా వ్యవసాయ అధికారి సోమవారం స్వరూప రాణి, జిల్లా రవాణా శాఖ అధికారి లక్ష్మణ్, జిల్లా మార్కెటింగ్ అధికారి నాగరాజు, శిక్షణ డిప్యూటీ కలెక్టర్ భవ్య సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# దృష్టి మరలచి నగల చోరీ

**- ఐదున్నర తులాల బంగారం చోరీ...**
**సిద్దిపేట్ టైమ్స్ మెదక్ ప్రతినిధి అక్టోబర్ 15**



బంగారం ఇంత మొత్తంలో మెడలో వేసుకు తిరుగుతే దొంగలు ఎత్తుకెళ్తారు జాగ్రత్త అంటూ భార్యాభర్తల దృష్టి మరల్చి దుండగులు చోరీకి పాల్పడిన సంఘటన పాపన్నపేట మండల పరిధిలోని కొత్తపల్లి బ్రిడ్జి సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. పాపన్నపేట ఎస్సై సారా శ్రీనివాస్ గౌడ్ సమాచారం మేరకు మండల పరిధిలోని నాగసాన్పల్లి గ్రామానికి చెందిన భూసనేల్లి కిషన్ అతడి భార్య మణెమ్మ ఇరువురు కలిసి తమ బంధువుల వద్దకు ఒక విందుకోసం టేక్మాల్ మండల పరిధిలోని ఎల్లుపేట గ్రామానికి స్కూటీపై బయలుదేరారు. కొత్తపల్లి బ్రిడ్జి వద్దకు రాగానే ఎదురుగా బైక్ పై వచ్చిన ఇరువురు వారిని ఆపి మేము ఆఫీసర్లమని, ఇంత నగలు వేసుకొని తిరగడం భావ్యం కాదని వారికి నచ్చ చెప్పారు , వాటిని తీసి ముల్లె కట్టి డిక్కీలో వేసుకోమని చెప్పడంతో, మానెమ్మ తమ మెడలో ఉన్న నాలుగు తులాల పుస్తెలతాడు ,తులం నర బంగారు గుండ్లను కర్చిఫ్లో కట్టి డిక్కిలో వేశారు, ఇదే అదనుగా భావించిన దుండగులు వారిని మైమరిపించి ఆ నగలను తస్కరించి పారిపోయారు, కొద్ది దూరం వారు వెళ్లిపోయాక, బాధితులు డిక్కిలో చూసుకొని లబోదిబోమన్నారు, వెంటనే పాపన్నపేట పోలీస్ స్టేషన్ చేరుకొని ఫిర్యాదు చేశారు, ఈ విషయమై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్ గౌడ్ వెల్లడించారు.

# 18న జరిగే బిసి రాష్ట్ర బంద్ ను జయప్రదం చేయండి

**సిద్దిపేట టైమ్స్, సిద్దిపేట, అక్టోబర్ 15 :**

42% బిసి రిజర్వేషన్లను రాజ్యాంగంలోని 9 వ షెడ్యూల్ చేర్చాలని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఈ నెల 18న బిసి రాష్ట్ర బంద్ కు మద్దతుగా బహుజన లెఫ్ట్ పార్టీ (బహుజన కమ్యూనిస్టు) బిఎల్ పి రాష్ట్ర అధ్యక్షులు దండి వెంకట్ తెలిపారు. బుధవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రతిభా కళాశాలలో బహుజన లెఫ్ట్ పార్టీ బిఎల్ పి ఉమ్మడి మెదక్ జిల్లా కమిటి సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల్లో 42% బిసి రిజర్వేషన్ అమలు చేయడానికి రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్ చేర్చే విధంగా తెలంగాణ రాష్ట్రంలోని బిసి కులాల ప్రజలు బిజెపి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు రాష్ట్ర బంద్ లో పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. 42% బిసి రిజర్వేషన్లను రాజ్యాంగంలోని 9 వ షెడ్యూల్ చేర్చే భాధ్యత కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానిదేనని దండి వెంకట్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల్లో 42% బిసి రిజర్వేషన్లను ప్రకటించినప్పుడు అసెంబ్లీలో మద్దతు ప్రకటించిన బిజెపి, బీఆర్ఎస్ పార్టీ లు ఇప్పుడు 9వ జీవో పై హైకోర్టు స్టే ఇవ్వడంతో మాట మార్చి మొత్తం నెపం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంపై నెట్టి రాజకీయ లబ్ధి పొందేందుకు బిజెపి,బీఆర్ఎస్ పార్టీలు ప్రయత్నించడం భావ్యం కాదన్నారు. బిసి రాష్ట్ర బంద్ కు ఎస్సీ ఎస్టీ మత మైనారిటీలు సంపూర్ణ మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

**బహుజన లెఫ్ట్ పార్టీ నూతన ఉమ్మడి జిల్లా కమిటి ఎన్నిక**

ఉమ్మడి జిల్లా అధ్యక్షులుగా తలారి ప్రవీణ్, ప్రధాన కార్యదర్శిగా రేపాక రాజు, జిల్లా ఉపాధ్యక్షులుగా కోటగిరి ఆంజనేయులు, సహాయ కార్యదర్శిగా ఎర్రోళ్ల చక్రపాణిలను నియమించినట్లు తెలిపారు. అదేవిధంగా పార్టీ అనుబంధ బహుజన లెఫ్ట్ ట్రేడ్ యూనియన్స్ BLTU ఉమ్మడి జిల్లా కన్వీనర్ శ్రీనివాస్ , కో కన్వీనర్ గా భాను ప్రసాద్, బహుజన డెమోక్రటిక్ స్టూడెంట్ ఫెడరేషన్ బిడిఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉమ్మడి జిల్లా ఇన్చార్జ్ గా దబ్బేట ఆనంద్, బహుజన లెఫ్ట్ మహిళా సంఘం ఉమ్మడి జిల్లా కన్వీనర్ వర్షా లను నియమించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి వడ్ల సాయి కృష్ణ,కమిటి సభ్యులు యాటల అనిల్ కుమార్ పాల్గొన్నారు. మార్క్సిజం అంబేద్కరిజం జమిలి సైద్ధాంతిక రాజకీయ కార్యక్రమం ద్వారా తెలంగాణలో బహుజన శ్రామిక ప్రజాస్వామ్య ప్రత్యామ్నాయ రాజ్యాధికారం లక్ష్యంగా పని చేస్తున్న బహుజన లెఫ్ట్ పార్టీ ఉమ్మడి మెదక్ జిల్లాలో బలోపేతానికి కృషి చేస్తారనే ఆశాభావాన్ని దండి వెంకట్ వ్యక్తం చేశారు.




# 'బీసీ రిజర్వేషన్ల సాధన సమన్వయ జేఏసీ ఆవిర్భావం


**- 18న రాష్ట్ర బంద్ కు పూర్తి మద్దతు**
**- జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు, జేఏసీ చైర్మన్ దుండ్ర కుమారస్వామి**
**సిద్దిపేట టైమ్స్, హైదరాబాద్, అక్టోబర్ 15:**

జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి నేతృత్వంలో బుధవారం కాచిగూడలో జరిగిన బీసీ సంఘాల ప్రతినిధుల సమావేశంలో 'బీసీ రిజర్వేషన్ల సాధన సమన్వయ జేఏసీ' ఆవిర్భావం జరిగింది. జేఏసీ చైర్మన్ గా దుండ్ర కుమారస్వామిని సమావేశంలో పాల్గొన్న యువజన నేతలు, కుల సంఘాల రతినిధులు, న్యాయవాదులు, ఆటో డ్రైవర్లు, వివిధ కార్మిక సంఘాల ప్రతినిధులు, బీసీ ఉద్యోగుల, మహిళా సంఘాల ప్రతినిధులు ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు, జేఏసీ చైర్మన్ దుండ్ర కుమారస్వామి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు స్టే ఇవ్వడం దారుణమని అన్నారు. హైకోర్టు ఇచ్చిన స్టేకు వ్యతిరేకంగా రాజ్యసభసభ్యులు ఆర్.కృష్ణయ్య నేతృత్వంలోని జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు ఈ నెల 18న జరిగే తెలంగాణ రాష్ట్ర బంద్ కు బీసీ రిజర్వేషన్ల సాధన సమన్వయ జేఏసీ పూర్తి మద్దతు ప్రకటిస్తుందని తెలిపారు. 16న గురువారం జేఏసీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించి పూర్తి స్థాయిలో పనిచేయడానికి రాష్ట్ర స్థాయి జేఏసీ కమిటీని ప్రకటిస్తామని ఆయన పేర్కొన్నారు. జేఏసీని గ్రామ స్థాయి వరకు తీసుకువెళ్లి 42 శాతం బీసీ రిజర్వేషన్లు సాధించే వరకు ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఆయన అన్నారు. బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న అగ్రకుల నేతలకు ఓటు ద్వారానే బీసీలు తగిన గుణపాఠం చెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని ఆయన హెచ్చరించారు. ఎప్పుడు ఎన్నికలు జరిగినా, ఏ ఎన్నికలు జరిగినా జనరల్ స్థానాల్లో బీసీలు పోటీ చేసి అగ్రకులాలకు రాజకీయమే లేకుండా చేస్తామని అన్నారు. బీసీల సంఘటిత శక్తి ఎలా ఉంటుందో అగ్రకులాల వారికి ఓటు ద్వారా చెబుతామని హెచ్చరించారు. బీసీల ఆత్మగౌరం, సమావన హక్కుల కోసం పోరాటం కొనసాగుతుందని అన్నారు. కార్యక్రమంలో బీసీ నేతలు రూబీన్ గౌడ్, శివాజీ, రాజేష్, శ్రీనివాస్, కృష్ణ, మహేష్, వెంకటేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# సిపిఆర్ పై అవగాహన

**- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ధనరాజ్**
**సిద్దిపేట టైమ్స్, సిద్దిపేట అక్టోబర్ 15:**

జిల్లాలో ప్రతి వ్యక్తికి సిపిఆర్ పై అవగాహన కలిగి ఉండాలనీ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ధనరాజ్ పేర్కొన్నారు.జిల్లా కలెక్టర్ కె హైమావతి ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టరేట్లో పని చేస్తున్న వివిధ శాఖలకు చెందిన ఉద్యోగులకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ధనరాజ్ అధ్యక్షతన సిపిఆర్ పై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. శిక్షణానంతరం ఉద్యోగులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ... ఈ శిక్షణలో శిక్షణ పొందిన ప్రతి ఒక్కరూ ఆపదలో ఉన్న వ్యక్తులను శిక్షణ ద్వారా నేర్చుకున్న ప్రక్రియను ఉపయోగించి ప్రాణాలను కాపాడాలని, జిల్లాలో ప్రతి వ్యక్తికి సిపిఆర్ పై అవగాహన కలిగి ఉండాలన్నారు. జిల్లాలో ఇతర లైన్ డిపార్ట్మెంట్ ఉద్యోగులకు, పాఠశాలలో, కళాశాల లో ఉద్యోగులకు సిబ్బందికి, బస్టాండ్ లో సిపిఆర్ పై శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ప్రతి పౌరుడు తన జీవన విధానాన్ని జీవన శైలిని మార్చుకోవాలని, తీసుకుని ఆహారంలో విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రతిరోజు వ్యాయామ చేయాలని, పని ఒత్తిడిని తగ్గించుకోవాలని, ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా, డాక్టర్ని సంప్రదించాలని అత్యవసర సమయంలో సిపిఆర్ నిర్వహిస్తూనే 108 నంబర్కు కాల్ చేసి పేషంట్ ని పంపించాలని తద్వారా పూర్తిగా ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు. అనంతరం ఉద్యోగులను గ్రూపులుగా విడదీసి, వైద్య అధికారుల చేత ఉద్యోగులందరికీ చేత సిపిఆర్ పక్రియను ఏ విధంగా చేయాలో నేర్పించారు.ఉద్యోగులు ఒక్కొక్కరుగా సిపిఆర్ సమర్థవంతంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో శిక్షణ డిప్యూటీ కలెక్టర్ భవ్య, సిపిఆర్ డిస్టిక్ కోఆర్డినేటర్ డాక్టర్ వినోద్ బాబ్జి, డాక్టర్ శ్రీకాంత్ యాదవ్, వైద్య అధికారులు, జిల్లా కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.






# మెదక్ జిల్లాలో మద్యం దుకాణాలకు పూర్తిస్థాయిలో దరఖాస్తులు

**- ఈనెల 18 వరకు దరఖాస్తులకు అవకాశం**
**- ఎక్సైజ్ అధికారి జి. శ్రీనివాస్ రెడ్డి**
**సిద్దిపేట్ టైమ్స్ మెదక్ ప్రతినిధి అక్టోబర్ 15**

మెదక్ జిల్లాలోని మొత్తం (49) మద్యం దుకాణాలకు గాను, అన్నింటికీ దరఖాస్తులు ఈ రోజు నాటికి 15.10.2025 వరకు వచ్చియని,ఈ రోజు వరకు మెదక్ జిల్లలో (276) వరకు దరఖాస్తులు అందాయన్నారు.దరఖాస్తులు తేది: 18.10.2025 సాయంత్రము వరకు స్వీకరించబడును 5.00 గంటల వరకు దరఖాస్తుదారులు ముందుగానే వచ్చి దరఖాస్తులు వేయవలసిందిగా జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి, జి. శ్రీనివాస్ రెడ్డి బుధవారం ఒక ప్రకటన తెలియచేసినారు.




# ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులకు డిజిటల్ లెర్నింగ్ పై శిక్షణా

**- ఎన్.శంకర్, మండల విద్యాధికారి, సదాశివపేట మండలం**
**సిద్దిపేట ట్రైన్స్ సంగారెడ్డి ప్రతినిధి:**

బుధవారం రోజున సదాశివపేట పట్టణంలో గల జీనియస్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ పాఠశాలలో లో భౌతిక శాస్త్రం టీచర్స్ కు ఏ బుక్ ఆన్ డిజిటల్ లెర్నింగ్ పై మూడు రోజుల శిక్షణా కార్యక్రమం నిర్వహించడం జరిగిందని మండల విద్యాధికారి ఎన్.శంకర్ తెలియజేశారు. ఇందులో ముఖ్యంగా తరగతి గదిలో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ను ఏ విధంగా ఉపయోగించాలి,ఎలక్ట్రానిక్ వలయాలలో ఆర్డియానో మైక్రో కంట్రోలర్ ని ఎలా ఉపయోగిస్తారో, డాటా సైన్స్ మరియు పైతాన్ లాంగ్వేజ్ గూర్చి వివరించాలన్నారు. దీని ద్వారా విద్యార్థులు సాంకేతికంగా అభివృద్ధి చెంది సులభంగా పాఠ్యాంశాలను నేర్చుకోగలుగుతారన్నారు. ఈ శిక్షణా కార్యక్రమంలో ఆర్పీలుగా కాస్తోపాత్ర,శ్రీదేవి, జీనియస్ స్కూల్ కరస్పాండెంట్ రఘువర్ధన్ రెడ్డి, ప్రిన్సిపల్ ప్రీతి, ఉజ్వల కాలేజ్ ప్రిన్సిపల్ శ్రీనివాస్ మరియు భౌతిక శాస్త్రం టీచర్స్ పాల్గొన్నారని మండల విద్యాధికారి ఎన్.శంకర్ తెలిపారు.







# పాము కాటుతో మృతి చెందిన యువకుడి కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి

**సిద్దిపేట టైమ్స్ దౌల్తాబాద్**

దౌల్తాబాద్ మండల పరిధిలోని తిరుమలాపూర్ గ్రామంలో గత శనివారం పాము కాటు గురై మంగళవారం తెల్లవారుజామున మృతి చెందిన జనగామ దయాకర్ కుటుంబాన్ని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దయాకర్ తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. కుటుంబ పరిస్థితులను తెలుసుకుని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం సాయం అందించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గ్రామస్థులు ఎమ్మెల్యేకు తమ సమస్యలను తెలియజేయగా, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ప్రమాద సమయంలో దయాకర్ ప్రాణాలను కాపాడే ప్రయత్నం చేసిన స్థానిక యువకులను ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు సయ్యద్ రహీమోద్దీన్, బోట్క సత్తయ్య గడ్డమీద సత్తయ్య నాగరాజు, యాదవ రెడ్డి, తోపాటు పార్టీ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



## బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఇబ్రామ్ శేఖర్ ను కలిసిన బీఎస్పీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు పుల్లూరు ఉమేష్

**సిద్దిపేట టైమ్స్, సిద్దిపేట అక్టోబర్,15**

బహుజన్ సమాజ్ పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో భాగంగా బుధవారం రోజున హైదరాబాదు లోని బీఎస్పీ రాష్ట్ర కార్యాలయంలో బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఇబ్రామ్ శేఖర్ ను బీఎస్పీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు పుల్లూరు ఉమేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థలు ఎంపీటీసీ జడ్పీటీసీలలో బీఎస్పీ పార్టీ సిద్దిపేట జిల్లాలో అధిక సంఖ్యలో గెలవాలని దానికి ఇప్పటినుండే ప్రణాళికలు సిద్ధం చేస్తూ పార్టీని ముందుకు తీసుకుపోతూ జిల్లాలోని ఎక్కువ స్థానాలను కైవసం చేసుకోవాలని ఈ సందర్భంగా బిఎస్పి సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు పుల్లూరు ఉమేష్ కు సూచించాడు. జిల్లాలో పార్టీ బలోపేతం చేయాలని ప్రణాళిక బద్ధంగా ముందుకెళ్లాలని సందర్భంగా ఆయన సూచించాడు. ఈ కార్యక్రమంలో జాతీయ సమన్వయకర్త మాజీ ఎమ్మెల్సీ అత్తార్ సింగ్ రావు సెంట్రల్ కోఆర్డినేటర్ సురేష్ ఆర్య ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కోఆర్డినేటర్ బాలయ్య స్టేట్ కోఆర్డినేటర్ నిసాని రామచంద్రం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈశ్వర్ రాష్ట్ర కార్యదర్శి లింగంపల్లి యాదగిరి నాయకులు పంగా బాబు చిట్యాల శ్రీనివాస్ కొండపలకల సంపత్ గార్లు పాల్గొన్నారు.




## JIH ఆధ్వర్యంలో యాంటీ డ్రగ్స్ కంపెయిన్

**సిద్దిపేట టైమ్స్, సిద్దిపేట, అక్టోబర్ 15**

జమాయితే ఇస్లామి హింద్ (JIH) ఆధ్వర్యంలో యాంటీ డ్రగ్స్, ఆల్కహాల్ అవేర్నెస్ క్యాంపులు నిర్వహిస్తున్నట్టు సిద్దిపేట జిల్లా JIH, ప్రెసిడెంట్ ఆతిఫుద్దీన్ అహ్మద్ తెలిపారు. బుధవారం సిద్దిపేట ప్రెస్ క్లబ్ లోవారు మాట్లాడారు. 15 నుండి 25 సంవత్సరాల లోపు యువత డ్రగ్స్ కు బానిస అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రగ్స్, ఆల్కహాల్ లాంటి మహమ్మారిలను తరిమికొట్టాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థుల్లో, యువతల్లో డ్రగ్స్, ఆల్కహాల్, లాంటి విష పదార్థాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రపంచం లోనే అత్యధిక యువ జనాభా ఉన్న దేశం భరత దేశం అన్నారు. యువత మత్తుకు బానిస అయితే దేశ అభివృద్ధి కుంటు పడుతుందని అన్నారు. అందులో భాగంగా JIH ఒక ప్రణాళికని రూపొందించిదని తెలిపారు. జిల్లా లో ఉన్న విద్యా సంస్థలు, పబ్లిక్ కార్నర్స్, గెట్ టూ గదర్, పబ్లిక్ మీటింగ్స్, 1:1మీటింగ్స్ ఏర్పాటు చేసి యాంటీ డ్రగ్స్, ఆల్కహాల్ లాంటి మహమ్మారిల పై అవర్నెస్ కల్పిస్తామని తెలిపారు. సమావేశం లో సంస్థ సభ్యులు అబ్దుల్ ఖుద్దుస్, హబీబ్, అబ్దుల్ రెహమాన్, కరీముద్దీన్, రియాసత్ అలీ, ఆదాబ్ మొయిజ్ తదితరులు పాల్గొన్నారు.




## అయ్యప్పల మహా పాదయాత్ర ప్రారంభం...

**- 1440 కిలోమీటర్ల దూరం..**
**- 5 రాష్ట్రాల మీదుగా ప్రయాణం...**
**- అయ్యప్ప శరణు ఘోషతో ఉత్సవం..**
**- దారి పొడుగునా భక్తుల నీరాజనం..**

**సిద్దిపేట టైమ్స్, సిద్దిపేట అక్టోబర్ 15**



అయ్యప్ప శరణు ఘోషల మధ్య సిద్దిపేట నుంచి శబరిమలై వరకు అయ్యప్పల మహా పాదయాత్ర బుధవారం సిద్దిపేటలో ప్రారంభమైంది. జిల్లా కేంద్రంలోని కోటిలింగేశ్వర స్వామి దేవాలయంలో సాయంత్రం సిద్దిపేట మున్సిపల్ చైర్ పర్సన్ కడవేరుగు మంజుల జెండా ఊపి పాదయాత్ర ప్రారంభించారు. విభిన్న వేషధారణలతో కళాకారులు, మంగళ వాయిద్యాలతో, డప్పుల మోతలతో, అయ్యప్ప నామ స్మరణతో అంగరంగ వైభవంగా మహాపాదయాత్ర ప్రారంభమైనది. మహా పాదయాత్రకు భక్తులు అడుగడుగునా నీరాజనం పలికారు. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. దాతలు బియ్యము, పప్పులు, కూరగాయలు, అటుకులు, మురుమురాలు, చిప్స్ మొదలగు వివిధ రకాల ఆహార సామాగ్రిని స్వచ్ఛందంగా, భక్తితో సమర్పించి అయ్యప్ప స్వాముల ఆశీస్సులు అందుకున్నారు. శ్రీ అఖిల అయ్యప్ప శబరిమలై ట్రస్ట్, సిద్దిపేట కోటిలింగాల అయ్యప్ప సన్నిధానం ల ఆధ్వర్యంలో ప్రారంభమైన మహా పాదయాత్రలో వివిధ ప్రాంతాల నుంచి 120 మంది అయ్యప్ప స్వాములు ఉత్సాహంగా పాల్గొన్నారు. తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్, కర్ణాటక, తమిళనాడుల మీదుగా కేరళ రాష్ట్రం లోకి ప్రవేశించిన అయ్యప్ప పాదయాత్రికులు 1440 కిలోమీటర్ల దూరం ప్రయాణించవలసి వస్తుంది. నవంబర్ 26 న మహా పాదయాత్ర ముగుస్తుంది ఈ పాదయాత్రలో పాల్గొన్న వారు నేరుగా శబరిమలైలోని 18 మెట్లను అధిరోహించి స్వామిని దర్శించుకునే అవకాశం కలుగుతుంది. మహా పాదయాత్రలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, వ్యాపారులు, పారిశ్రామికవేత్తలు, వివిధ రకాల వృత్తుల అయ్యప్ప మాలదారులు ఉన్నారు. వీరి వెంట దాతలు సమకూర్చిన వివిధ రకాల వస్తువులతోపాటు అత్యవసర పరిస్థితులను ఎదుర్కోవడానికి ఒక కారు కూడా ఉంటుంది. ప్రతిరోజు ఉదయం 3 గంటల నుంచి మధ్యాహ్నం 12:00 వరకు, ఆ తర్వాత సాయంత్రం నాలుగు గంటల నుంచి 7 గంటల వరకు మహా పాదయాత్ర జరుగుతుంది. ప్రతిరోజు సుమారు 32 కిలోమీటర్ల ప్రయాణం సాగుతుంది. నిర్దేశించుకున్న కేంద్రాల వద్ద అయ్యప్ప స్వాములు బిక్ష తీసుకుంటారు. పూజలు చేసుకుంటారు. నిద్ర పోతారు. ఈ పాదయాత్రలో 20 సంవత్సరాలు నుంచి 70 సంవత్సరాల మధ్య వయస్కులైన వివిధ వర్గాల వారు ఉన్నారు. ప్రతిరోజు ఉదయం అంబలి లేదా తేనీరు, మధ్యాహ్నం బిక్ష, సాయంత్రం అల్పాహారం ఉంటుంది.

**కోట్ల జప పుణ్యం..మహా పాదయాత్ర లక్ష్యం..**

ఈ సందర్భంగా బుధవారం మహా పాదయాత్ర సారధులు గడప నాగరాజు స్వామి, మధుసూదన్ రెడ్డి స్వామి, యాదవ రెడ్డి స్వామి తదితరులు మీడియాతో మాట్లాడుతూ మహా పాదయాత్ర వల్ల లక్షల కోట్ల జపం, అయ్యప్ప నామస్మరణం జరుగుతుందని తెలిపారు. పాదయాత్రలో పాల్గొన్న అయ్యప్ప స్వాములకు ఆరోగ్యం, ధైర్యము, విశ్వాసం లభిస్తాయని చెప్పారు. కోరిన కోరికలు, మొక్కులు తీరిన అయ్యప్ప స్వాములు ఉత్సాహంగా మహా పాదయాత్రలో పాల్గొంటారని తెలిపారు. సహకారం, సమన్వయం, ఆధ్యాత్మికం స్వాములను ఒక్కటిగా చేస్తుందని తెలిపారు. కర్ణాటక రాష్ట్రంలో అడుగడుగునా అన్ని వర్గాల ప్రజలు భజనలతో స్వాగతం పలికి, పండ్లు, అల్పాహారాలు, బిక్షలు అందించి ఆశీస్సులు పొందుతారని తెలిపారు. ముఖ్యంగా చివరి రోజు శబరిమలై సమీపంలోని పులిమేడు గుట్టల్లో 12 కిలోమీటర్ల పాదయాత్ర ప్రతికూల, ప్రమాదకర పరిస్థితులలో సాగుతుందని తెలిపారు. అయ్యప్ప ఆశీస్సులతో, ప్రజల సహకారంతో ఈ పాదయాత్ర విజయవంతంగా కొన్ని సంవత్సరాలు నుంచి సాగుతుందని తెలిపారు

# ఆ గ్రామంలో 51 మంది ఆత్మహత్యలు

చిన్న చిన్న సమస్యల నుండి పెద్ద, పెద్ద సమస్యలను తీర్చలేక మానసిక స్థైర్యాన్ని కోల్పోయి ఆ సమస్యల పరిష్కారానికి (చావే) ఆత్మహత్యలే శరణ్యం అనుకొని ఆత్మహత్య చేసుకొని తనవులు చాలిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా ప్రతి 40 సెకండ్లకు ఒక వ్యక్తి ఆత్మహత్య, అంటే సంవత్సరానికి సుమారు మూడు లక్షల మంది ఆత్మహత్యలు చేసుకుంటున్నట్లు WHO నివేదికలు తెలియజేస్తున్నాయి. ఆత్మహత్య అనేది ఒక వ్యక్తి తన జీవితాన్ని అర్ధాంతరంగా తనకు తానే ముగించుకోవడం. ప్రతి గ్రామంలో కొన్ని సంవత్సరాలుగా అప్పుల బాధతో రైతులు, మార్కులు తక్కువ వచ్చినయిని విద్యార్థులు, ప్రేమ విఫలమైందని ప్రేమికులు, ఉద్యోగం రాలేదని నిరుద్యోగులు, ఆరోగ్యం బాగాలేక రోగులు, మద్యానికి బానిసై, జీవితం వ్యక్తిపై ఇట్లా వివిధ కారణాల చేత ఆత్మహత్య చేసుకుని చనిపోతున్న వార్తలు మనం వివిధ దిన పత్రికలో ప్రతిరోజు చూస్తున్నాము. ఈ ఆత్మహత్యల వార్తలన్నీ మనకు సర్వసాధారణమే! మన బంధువులు కానీ తెలిసిన వారు కానీ ఆత్మహత్య చేసుకుంటే ఆ క్షణం బాధపడి వదిలేస్తాం. ఈ ఆత్మహత్యల గురించి కానీ, వాటికిగల కారణాల, గురించి గానీ ఆలోచించే సమయం, తీరిక, అవసరం గాని ప్రభుత్వాలతో పాటు, పౌర సమాజం సమయం ఇవ్వడం లేదు అంటే అతిశయోక్తి కాదు. ఆత్మహత్య చేసుకుంటే ఆ కుటుంబమే చూసుకుంటుందిలే, వారే భరిస్తారులే అనే కోణంలో ఆ క్షణం బాధపడి వదిలేస్తున్నాం. ఒక వ్యక్తి ఆత్మహత్య వల్ల సమాజం ఎంత నష్టపోతుందో ఆలోచించడం లేదు.

చాలా గ్రామంలో 20, 25 సంవత్సరాలలో 7 నుండి 9 మంది ఆత్మహత్య చేసుకున్నారు.

కానీ ఈ గ్రామంలో సుమారు 20 సంవత్సరాలలో 51 మంది ఆత్మహత్య చేసుకొని బలవన్మరణాలకు పాల్పడడం అత్యంత విషాదకరం, బాధాకరం. బాధిత కుటుంబాల జీవితాల్లో మార్పు తీసుకురావాలని, అదేవిధంగా భవిష్యత్తులో ఆత్మహత్యలు చేసుకోవద్దనే సంకల్పంతో ఆత్మహత్యల వల్ల ఆ కుటుంబాలు భవిష్యత్తులో ఎదురయ్యే సమస్యల గురించి వివరిస్తూ ఆ కుటుంబాల తో పాటు మిగతా కుటుంబాలను మోటివేషన్ చేస్తూ ఈ ఊరిని గత రెండు సంవత్సరాలుగా పరిశీలిస్తూ గడప, గడప కు తిరిగి ఆత్మహత్య చేసుకోవడానికి గల వాస్తవ పరిస్థితుల ఆధారంగా గ్రామీణ జీవితాలలో విషాద సంఘటనలను పరిశీలిస్తే ఈ క్రింది అంశాలు తెలిసినాయి. ఈ గ్రామము



సిద్దిపేట జిల్లా, వర్గల్ మండలం, వేలూరు గ్రామం. ఈ గ్రామం పూర్తిగా వ్యవసాయక గ్రామం. ఈ ఊరిలో జరిగిన వివిధ రకాల ఆత్మహత్యలు భవిష్యత్తులో ఏ ఊరిలో జరుగవద్దని ఆశిస్తున్నాను. కానీ ఈ వేలూరు గ్రామంలో సుమారు 20 సంవత్సరాలలో 51 మంది ఆత్మహత్య చేసుకోవడం చాలా ఆశ్చర్యాన్ని కలిగించే విషాదకరమైన సంఘటన అయినప్పటికీ ఇది నిజం! ఈ ఆత్మహత్యలు వ్యవసాయ ఆర్థిక, కుటుంబ, ఆరోగ్య, చెడు అలవాట్లకు బానిసలై, చదువుకు భయపడి, జీవితపై విరక్తి కలిగి, సామాజిక మరియు మానసిక పరిస్థితులు తట్టుకోలేక జరుగుతున్న ఆత్మహత్యలు. ఇలాంటి దురదృష్ట సంఘటనలు కేవలం ఆ కుటుంబానికే కాక ఆ ఊరు, ఆ మండలం, ఆ ప్రాంతము పైన ప్రభావమే కాక సమాజంలోని మానవ విలువలు ప్రశ్నార్ధకంగా మారుతున్నాయి. ఇంతమంది ఆత్మహత్య చేసుకోవడం అంటే ఆ ఊరిలో ఎన్ని కుటుంబాలకు గర్భశోకం మిగిలిందో మనం అర్థం చేసుకోవచ్చు. ఇన్ని ఆత్మహత్యలు జరిగిన ఈ ఊరిలో ఆడపిల్లల్ని ఇవ్వడానికి కానీ,(పెండ్లి) తీసుకపోవడానికి గాని ఇతర గ్రామస్తులు భయపడుతున్నారంటే ఈ గ్రామ ఆత్మహత్యలు ఏ స్థాయికి వెళ్ళాయో ఆత్మహత్యల అంశం ఎంత తీవ్రమైందో మనకు అర్థమవుతుంది. కుటుంబంలో ఒకరు చనిపోతే అది ఆ తరానికే కాకుండా రెండు, మూడు తరాల వరకు దాని ప్రభావం ఉంటుంది. ఇంటి పెద్ద చనిపోవడంతో ఆ కుటుంబంలో భార్య/భర్త, పిల్లలు, తల్లిదండ్రులు, అన్నదమ్ములు, అక్కచెల్లెల బంధాలు చిన్నభిన్నం అవుతాయి. ఆ కుటుంబ సభ్యుల మానసిక స్థితిపైన కూడా అత్యంత ప్రభావం చూపుతుంది. ఈ గ్రామంలో కొన్ని కుటుంబాలలో తండ్రి, ఇద్దరు కొడుకులు, ఇంకో కుటుంబంలో ముగ్గురు అన్నదమ్ములు ఆత్మహత్య చేసుకున్నారు. కొన్ని కుటుంబాలు వంశం లేకుండా కూడా పోయినాయి. నా పరిశీలనలో ఎక్కువగా వ్యవసాయానికి చేసిన అప్పులు ఎక్కువై అప్పులు తీర్చే మార్గం లేక 45 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు.(ఆర్థిక సమస్యలు/కుటుంబ సమస్యలు. ఆర్థిక సమస్యలే కుటుంబ సమస్యలుగా మారుతాయి.) ఇంకొంతమంది కుటుంబాన్ని పోషించడానికి ఆదాయ మార్గాలు లేక అప్పులు పుట్టక ఆత్మహత్య చేసుకున్నారు.

వృత్తుల వారిగా ఆత్మహత్యలు:
1. వ్యవసాయం: 45
2. డ్రైవింగ్: 03
3. విద్యార్థులు:-02
4. ప్రైవేట్ జాబ్: 01

ముఖ్యంగా యువత చిన్న చిన్న కారణాలతో, క్షణికావేశంలో ఆత్మహత్యలకు పాల్పడి తల్లిదండ్రులను ఒంటరి వాళ్లను చేశారు.

60 సంవత్సరాల నుండి 80 సంవత్సరాల వయస్సు కలిగిన స్త్రీ, పురుషులు ఆత్మహత్యలను గమనిస్తే విషాదకరమైన వాస్తవాలు తెలిసాయి. వృద్ధాప్యంలో సరిగా భోజనం పెట్టకపోవడం వారిని ఆప్యాయంగా మాట్లాడించకపోవడం, చిన్న, చిన్న ఆరోగ్యపరమైన సమస్యలు చెప్పితే కుటుంబ సభ్యులు స్పందించకపోవడం వృద్ధాప్యంలో వారికి ఆదరణ కరువువవడంతో తమ పిల్లలు ఇక వారిని సాదుతరనే నమ్మకం లేకపోవడంతో వారికి ఉన్న తక్కువ జీవిత కాలాన్ని కూడా అనుభవించక జీవితాల పై విరక్తి చెంది ఆత్మహత్యలు చేసుకున్నారు. మానవ విలువలు క్రమక్రమంగా ఆర్థిక విలువలుగా మారి కన్నవారిని కూడా చూసుకోలేని దౌర్భాగ్య పరిస్థితి వచ్చిందంటే సమాజం ఎటువైపు ప్రయాణిస్తుందో!

కొంతమంది పెండ్లి ఇష్టం లేక ఇంకొంతమంది పరీక్షలో ఫెయిల్ అయితామని కొంతమందికి పెండ్లికి అమ్మాయిలను ఇవ్వకపోవడంతో కూడా ఆత్మహత్యలు చేసుకున్నారు.

వయస్సుల వారిగా ఆత్మహత్యలు:
15 - 20 :- 07
21- 30:-10
31- 40:-17
41- 50:-04
51- 60:-04
61- పైన:-09

ఈ ఆత్మహత్యలలో 45 రైతులు ఉన్నారు. కులాల వారిగా చూస్తే

గొల్ల/ యాదవ కుటుంబానికి చెందినవారు మొదటి స్థానంలోను, ఎస్సి సామాజిక వర్గం రెండవ స్థానంలోను ఉన్నారు. ఈ గ్రామంలో సుమారు 720 కుటుంబాలు ఉంటాయి. సుమారు 99 శాతం మంది వ్యవసాయం మీద మిగతా కొంతమంది వ్యవసాయేతర పనుల మీద ఆధారపడి జీవిస్తారు.

సామాజిక వర్గాల వారిగా ఆత్మహత్యలు:
1.గొల్ల/యాదవ:-20
2.మాదిగ:- 08 3.ముదిరాజ్:- 05
4.మాల:- 04
5.చాకలి:- 03
6.రెడ్డి:- 03
7.గౌడ:- 03
8.కమ్మరి:- 02
9.కుమ్మరి:- 02
10.ముస్లిం:- 01
మొత్తం:- 51

నా వ్యక్తిగతంగా నేను 25 సంవత్సరాల నుండి రైతు ఆత్మహత్యల మీద పనిచేస్తున్నాను. 3 సంవత్సరాల క్రితం గతంలో జరిగిన రైతు ఆత్మహత్యల వివరాలను పరిశీలిస్తుండగా ఈ గ్రామంలో ఎక్కువ ఆత్మహత్య చేసుకున్నట్లు నమోదు కావడంతో ఆ గ్రామంలోని ప్రతి ఆత్మహత్య పరిశీలించి ఆత్మహత్యకు గల కారణాలు తెలుసుకొని ప్రభుత్వానికి, సమాజానికి తెలియజేసి ప్రభుత్వం, సమాజ బాధ్యతను గుర్తు చేయాలనే ఉద్దేశంతో ఈ గ్రామాన్ని ఎన్నుకోవడం జరిగింది.

ఈ గ్రామాన్ని ఎన్నుకున్న తర్వాత సిద్దిపేట జిల్లా పోలీస్ కమిషనర్ గారికి RTI 2005 చట్టం ప్రకారం వేలూరు గ్రామంలో జరిగిన వివిధ రకాల ఆత్మహత్యల వివరాలు తేదీ.01/01/2000 నుండి 30/04/2023 వరకు ఇవ్వవలసిందిగా కోరితే పోలీస్ డిపార్ట్మెంట్ నుండి కేవలం 27 మంది ఆత్మహత్యల వివరాలు మాత్రమే తెలియజేశారు. కానీ గ్రామంలో నేను పరిశీలన చేస్తున్నప్పుడు మా ఇంట్లో ఆత్మహత్య చేసుకున్నారు, మా ఇంట్లో ఆత్మహత్య చేసుకున్నారని చెప్పడంతో అన్ని కుటుంబాలను పరిశీలించే ప్రయత్నంలో భాగంగా కొన్ని కుటుంబాలు ఇక్కడ బతుకుదెరువు లేక వేరే ప్రాంతాలకు వలస వెళ్లడం జరిగింది. ఇంకా కొన్ని కుటుంబాలు పూర్తిగా వారి వంశం లేకుండా పోయింది. నా దృష్టికి రాని ఆత్మహత్యలు కూడా ఉండవచ్చు. కొన్ని ఆత్మహత్యలు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయకపోవడంతో FIR.NO.లేవు.

కొంతమంది బాధితుల ఫోటోలు, చనిపోయిన తేదీలు కూడా అందుబాటులో లేవు. గ్రామంలో అందుబాటులో ఉన్న అన్ని బాధిత కుటుంబాల దగ్గరికి వెళ్లి వారి యొక్క దీనగాథలను తెలుసుకున్నాను.

ఆత్మహత్య చేసుకున్న విధానం:


1.పురుగుల మందు తాగి:- 24
2.ఉరివేసుకొని:- 21
3.నీళ్లలో పడి: - 5 4.కిరోసిన్ పోసుకుని:- 1

ఆత్మహత్య చేసుకున్న స్త్రీ పురుషులు సంఖ్య:
పురుషులు:- 42
స్త్రీలు :- 09

ఆత్మహత్యల ప్రభావితం గల గ్రామాలలో ప్రభుత్వాలు అవేర్నెస్ కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆ కుటుంబాలను విద్యా, వైద్య, ఆర్థికపరమైన అంశాలను వారికి వెన్నుదన్నుగా ఉండాలి. ఆత్మహత్య చేసుకుంటే వారి కుటుంబం ఎలాంటి పరిస్థితులకు వెళుతుందో ప్రభుత్వాలు పౌర సమాజం సమాజానికి తెలియజేయాలి.

"ఆత్మహత్యలు వద్దు కుటుంబమే ముద్దు"

ప్రతి వ్యక్తి ఈ దేశ సంపద అని భావించి భవిష్యత్తులో ఎవరు కూడా ఆత్మహత్య చేసుకోవద్దని ఆత్మహత్యలు లేని సమాజ నిర్మాణం కోసం మనమందరం కృషి చేయాలని ఆశిస్తున్నాను.



రచయిత,
పులి రాజు,
సామాజిక కార్యకర్త 9908383567.